నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

RNI - TELTEL/2023/87644

సంచిక : 22 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | ఆదివారం | 31-05-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


**నీలగిరి నిత్యపద్యం**

ఆటవెలది

బుద్ధిబలమునున్న భువిలోన జాడగా
కాకులోలె వదురు లోకులెల్ల
పళ్ళ చెట్టుకేను రాళ్ళదెబ్బలు సుమ్ము
విజయలక్ష్మి వాక్కు వినుర నరుడ

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.




## అధికారంలోకి రాగానే.. 111 జీవో ఎత్తివేస్తాం

- రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని ముంచిన గుంపు మేస్త్రీ
- సర్కార్‌పై పోరాటానికి ప్రజలంతా సిద్ధం కావాలి
- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

రంగారెడ్డి

చేవెళ్ల నియోజక వర్గానికి శాపంగా మారిన 111 జీవోను టీఆర్ఎస్ అధికారంలోకి రాగానే పూర్తిగా ఎత్తివేస్తామని ఆ పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. జీవో ఎత్తివేస్తామని ఎన్నో ప్రభుత్వాలు హామీ ఇచ్చినా అమలు చేయలేదని విమర్శించారు. మొయినాబాద్‌లో శనివారం తెలంగాణ రక్షణ సేన జెండా ఆవిష్కరించిన కవిత కార్యక్రమానికి కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 111 జీవో ఎప్పటి నుంచో ఉన్న సమస్య, దీనిని రద్దు చేయాల్సింది పోయి జటిలం చేశారని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే జీవో ఎత్తివేసి ఈ ప్రాంత ప్రజలకు పూర్తిగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో కొత్త రాజకీయ శక్తిగా మనం పుట్టుకొచ్చామని తెలిపారు.

-మిగతా 2 లో

## మోటర్లకు మీటర్లు పెడితే ఎన్నికల్లో

# పోటీచేయను

### ఉచిత విద్యుత్ ఆపేసినా రాజకీయాల నుంచి తప్పుకుంటా

- లేకుంటే బిఆర్ఎస్ రాజకీయాల నుంచి తప్పుకుంటుందా
- రైతుల ముసుగులో లబ్ధికి కేసీఆర్ రాజకీయ ఎత్తుగడలు
- ధాన్యం కొరుగోళ్లలో కేంద్రం తీరు దుర్మార్గం
- కొనకపోతే బిజెపి ఎంపిల ఇళ్లముందు ధాన్యం పోస్తాం
- హరీష్ రావు భవిష్యత్తు ఆయన చేతుల్లోనే లేదు
- మహేశ్ గౌడ్‌ది నాది విన్నింగ్ కాంబినేషన్
- మీడియా చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్,

: తెలంగాణలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ నిలిపివేసినా, మోటార్లకు మీటర్లు పెట్టినా తాము ఎన్నికల్లో పోటీ చేయబోమని, ఈ సవాల్‌కు బీఆర్ఎస్ సిద్ధమా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. శనివారం ఆయన మీడియాతో చిట్ చాట్ చేస్తూ.. రాజకీయ లబ్ధి కోసమే కేసీఆర్ రైతుల ముసుగులో లైఫ్ లైన్ కోసం ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. దేశంలోనే తొలిసారిగా రైతుల కోసం ప్రత్యేకంగా 'రైతు డిస్కం' ఏర్పాటు చేశామని, దీనివల్ల ప్రభుత్వానికి తక్కువ ధరకే విద్యుత్ కొనుగోలు చేసే వెసులుబాటుతో పాటు జవాబుదారీతనం పెరుగుతుందని స్పష్టం చేశారు. భారత రాష్ట్ర సమితికి సీఎం

-మిగతా 2 లో



## బలహీన బాల భారతం!

- జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-6 గణాంకాలు వెల్లడి
- ఇప్పటికీ 31.8 శాతం పిల్లల్లో పోషకాహార లోపం
- 40 శాతం పెద్దల్లో ఊబకాయం, మధుమేహం

న్యూఢిల్లీ

భారతదేశం పోషకాహార లోపంలో ఏ స్థాయిలో ఉన్నదో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-6 కండ్ల ముందుంచింది. డబుల్ ఇంజిన్ సర్కార్ అని, డిజిటల్ ఇండియా అంటూ గొప్పలు చెప్పుకుంటున్న మోదీ ప్రభుత్వమే దేశంలో ఇంకా 31.8 శాతం మంది పిల్లలు పోషకాహార లోపంతో బాధ పడుతున్నారని అధికారికంగా తెలిపింది. శుక్రవారం జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-6 విడుదల చేసిన నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది.

-మిగతా 2 లో



## ఒక కుటుంబానికి ఒకే గ్యాస్ కనెక్షన్..


- జూన్ 1 నుంచి కొత్త నిబంధనలు అమలు
- బహుళ కనెక్షన్లు కలిగి ఉండటం చట్ట విరుద్ధం
- అదనపు సిలిండర్లను అప్పగించాల్సిందే
- ఒకటి కన్నా ఎక్కువ గ్యాస్ కనెక్షన్లు ఉన్న కుటుంబాలకు కేంద్రం షాక్

న్యూఢిల్లీ

ఒకే ఇంటిలో ఒకటి కన్నా ఎక్కువ గ్యాస్ కనెక్షన్లు ఉన్న కుటుంబాలకు కేంద్రం షాకిచ్చింది. పశ్చిమాసియా యుద్ధ సంక్షోభం, హెర్మూజ్ జలసంధి వద్ద ఏర్పడిన ప్రతిష్ఠంభనతో ఎల్పీజీ దిగుమతి గణనీయంగా తగ్గిపోయిన క్రమంలో గ్యాస్ వినియోగాన్ని నియంత్రించడానికి ఒక కుటుంబానికి ఒకటే గ్యాస్ కనెక్షన్ నిబంధన అమలుకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నిబంధనలు జూన్ 1 నుంచి అమల్లోకి వస్తాయని ప్రకటించింది. ఒకే ఇంటిలో ఒకటి కన్నా ఎక్కువగా బహుళ గ్యాస్ కనెక్షన్లు ఉంటే అది చట్ట విరుద్ధమని పేర్కొన్నది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ ఆయిల్ మార్కెటింగ్ సంస్థలైన ఇండియన్ ఆయిల్, హెచ్‌పీసీఎల్, భారత్ పెట్రోలియం గ్యాస్ వినియోగదారులను ఉద్దేశించి ఉమ్మడి ప్రకటన చేశాయి.నూతన నిబంధనలను అనుసరించి వినియోగదారులు

-మిగతా 2 లో

## హోర్ముజ్ నిర్వహణ హక్కు మాదే



- అమెరికాతో ఇంకా ఒప్పందమేదీ ఖరారు కాలేదు :ఇరాన్ వెల్లడి
- యూఎస్ అధ్యక్షుడి నోట నిజాల కన్నా అబద్ధాలే ఎక్కువ
- హోర్ముజ్ నిర్వహణ హక్కు మాదే !
- అమెరికాతో ఇంకా ఒప్పందమేదీ ఖరారు కాలేదు! : ఇరాన్ వెల్లడి
- యూఎస్ అధ్యక్షుడి నోట నిజాల కన్నా అబద్ధాలే ఎక్కువ

టెహ్రాన్/వాషింగ్టన్

హోర్ముజ్ జలసంధిని బేషరతుగా తెరిచేందుకు ఇరాన్ అంగీకరిం చిందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనను టెహ్రాన్ తోసి పుచ్చింది. తాను సమీక్షిస్తున్న ముసాయిదా ఒప్పందంలో అలాంటి అంశమేదీ లేదని స్పష్టం చేసింది. ట్రంప్ చెప్పే విషయాలలో కొన్ని వాస్తవాలు, మరికొన్ని అబద్ధాలు ఉన్నాయని తెలిపింది. ట్రంప్ వ్యాఖ్యలు 'కల్పిత విజయాన్ని చిత్రించేలా' ఉన్నాయని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) అనుబంధ ఫార్స్ న్యూస్ ఎద్దేవా చేసింది. నిర్ణయం ఏదీ తీసుకోనప్పటికీ ప్రతిపాదిత ఒప్పందం ఇరాన్ తుది అనుమతి కోసం ఎదురు చూస్తోందని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఆ వార్తా సంస్థ తెలియజేసింది.

-మిగతా 2 లో

## బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ అరెస్ట్

- సింగరేణిపై.. అనుచిత వ్యాఖ్యలు
- తెలంగాణ భవన్ వద్ద హైటెన్షన్
- పోలీసులను అడ్డుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు




## సీఎం రేవంత్.. జిల్లాల టూర్

### జూన్ 1 నుంచి 5వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్త పర్యటనలు



- ఒకటో తేదీన అదిలాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం
- 3న కోహెడలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు భూమి పూజ
- 4న నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పనులు పరిశీలన
- 5న హైదరాబాద్‌లో మహిళా సంఘాలకు బస్సులు పంపిణీ

హైదరాబాద్,

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూన్ 1వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. అలాగే బహిరంగ సభలు నిర్వహించనున్నారు.ఈ మేరకు జూన్ 1న అదిలాబాద్‌కు సీఎం రేవంత్ రెడ్డి రానున్నారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం చుట్టనున్నారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. 3న రంగారెడ్డి జిల్లా కోహెడలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించనున్నారు.

-మిగతా 2 లో

## కర్నాటక సీఎంగా డీకే శివకుమార్

- ప్రకటించిన కేపీసీసీ
- జూన్ 3న ప్రమాణస్వీకారం



బెంగళూరు

కర్నా టక తదుపరి ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ పగ్గాలు చేపట్టనున్నారు. శనివారం సాయంత్రం బెంగళూరులో జరిగిన కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశంలో సీఎల్పీ నేతగా డీకే శివకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మాజీ సీఎం సిద్ధరామయ్య డీకే పేరును ప్రతిపాదించగా ఎమ్మెల్యేలంతా సమర్థించారు. దీంతో కర్ణాటక కాంగ్రెస్

-మిగతా 2 లో



## దేశానికి "ధర్మ హింస" అవసరమే..

- దేశం, సమాజానికి ముప్పుగా మారితే హింస అవసరం
- యూపీ సీఎం యోగి సంచలన వ్యాఖ్యలు
- ధర్మరక్షణ కోసం బలప్రయోగం సమర్థనీయం
- అందుకోసమే బలమైన దేశాలతోనే ప్రపంచం స్నేహం

లక్నో:

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దేశ భద్రత, అహింస, ధర్మరక్షణ అంశాలపై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మికతలో అహింసకు అత్యున్నత స్థానం ఉన్నప్పటికీ, దేశం లేదా సమాజం ప్రమాదంలో పడినప్పుడు కేవలం అహింసతోనే సమస్యలను పరిష్కరించడం సాధ్యం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ధర్మాన్ని కాపాడటానికి అవసరమైతే బలప్రయోగం కూడా సమర్థనీయమని ఆయన స్పష్టం చేశారు. యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ అహింస అనేది మానవాళికి పరమ ధర్మమని పేర్కొన్నారు. శాంతి, సహనం, పరస్పర గౌరవం వంటి విలువలు సమాజ నిర్మాణానికి ఎంతో అవసరమని అన్నారు. అయితే ఈ విలువలని దుర్వినియోగం చేస్తూ దేశ భద్రత లేద సమాజ శాంతి భంగం కలిగించే శక్తులను ఎదుర్కోవాల్సిన పరిస్థితి వచ్చినప్పుడు ప్రభుత్వం చేతులు ముడుచుకుని కూర్చోలేదని చెప్పారు. అలాంటి సందర్భాల్లో ధర్మాన్ని రక్షించడానికి కఠిన చర్యలు తీసుకోవడం అనివార్యమని పేర్కొన్నారు

-మిగతా 2 లో



## మోసపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

- కాంగ్రెస్ పాలనలో రైతులు మోసపోయారు
- బిజెపి ప్రజల్లోకి వెళితే తప్ప ప్రభుత్వం మేల్కోలేదు
- కేంద్రాన్ని విమర్శించడం తప్ప చేసిందేమీ లేదు
- మీడియా సమావేశంలో మండిపడ్డ కిషన్ రెడ్డి

హైదరాబాద్,

మార్పు పేరుతో దొంగ మాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని.. తెలంగాణ రైతాంగం పట్ల నిర్లక్ష్యంగా నిస్సిగ్గుగా వ్యవహరిస్తుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడ లేని విధంగా దళారులు, ప్రభుత్వం, రైస్ మిల్లర్ల చేతిలో రైతులు విలవిల్లాడుతున్నారని తెలిపారు. ఈ ప్రభుత్వం చేతకాని తనం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. మంత్రులు ఏసీ రూముల్లో గడిపారని.. తమ ఎంపీలు, ఎమ్మెల్యేలు రైతుల దగ్గరికి వెళ్ళే వరకు

-మిగతా 2 లో

## ఒక్క ఏడాది ఆగండి..కాంగ్రెస్‌కు మిత్తితో చెల్లిద్దాం




- నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ లేదు
- రేవంత్ రెడ్డి, రాహుల్ కు గుణపాఠం చెప్పాలి
- సర్‌పై బీఆర్ఎస్ శ్రేణులకు మాజీ మంత్రి కేటీఆర్ అవగాహన

ముషీరాబాద్

డిక్లరేషన్ల పేరుతో అన్ని వర్గాలను మోసం చేసిన కాంగ్రెస్ పాలకులను యువత నిలదీయాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ పిలుపు ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక జీహెచ్ఎంసీ పరిధిలో కొత్తగా ఒక్క

-మిగతా 2 లో

# అధికారంలోకి రాగానే.. 111 జీవో ఎత్తివేస్తాం



మొదటి తరువాయి

తెలంగాణ హక్కులను తెలంగాణ రక్షణ సేన పరిరక్షిస్తుందన్నారు. ఈ ప్రాంతంలో చూస్తే ఎకరాకు వంద కోట్ల రూపాయలు పలుకుతున్న పరిస్థితి మనం చూస్తున్నామని, 120 గ్రామాలకు సంబంధించి 111 జీవోను అమలులో ఉండుదునా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పిల్లల పెళ్లిళ్ల కోసం ఒక పావు ఎకరం అమ్ముకున్నా మంచి ధర వచ్చే పరిస్థితి లేదని తెలిపారు. గుంపు మేస్త్రీ నాకు రియల్ ఎస్టేట్ వ్యాపారమే బాగా తెలుసు అని గొప్పలు చెప్పుకుంటడు.. ఆ వ్యాపారాన్ని కూడా ఊడగొట్టిందని విమర్శించారు. ఎలాంటి గ్యారంటీ లేకుండా నిరుద్యోగులకు రూ. 2 లక్షల నుంచి రూ. 20 కోట్ల వరకు రుణాలు అందిస్తామని కవిత హామీ ఇచ్చారు.

# బలహీన బాల భారతం!

మొదటి తరువాయి




దేశవ్యాప్తంగా 715 జిల్లాల్లో 6.79 లక్షల కుటుంబాలపై ఈ సర్వే నిర్వహించారు.

**పోషకాహార లోపం పెద్ద సవాల్..**

సర్వే ప్రకారం ఐదేళ్లలోపు ఉన్న 29.3 శాతం మంది పిల్లలు ఉండాల్సిన ఎత్తు కంటే తక్కువ ఉంటున్నారు. అంటే ప్రతి 10 మందిలో ముగ్గురు ఎత్తు సమస్యతో, 5.2 శాతం మంది శారీరక బలహీనతతో బాధపడుతున్నారు. అలాగే నవజాత శిశువులకు సగం మంది తల్లులు మాత్రమే పుట్టిన గంట లోపు పాలు పడుతున్నారు. పైగా 40.5 శాతం మంది పిల్లలకు తల్లిపాలతో అందాల్సిన సమతుల్య ఆహారం అందట్లేదు. వీటి కారణంగా పిల్లలు బలహీనంగా, ఎత్తు, బరువు తక్కువగా ఉంటున్నారు. పుట్టిన పిల్లల్లో ఇంకా 13 శాతం మందికి సరైన టీకాలే అందట్లేదు. మీజిల్స్ రెండో డోస్ టీకా కేవలం 71.8 మందికే అందుతున్నది.

ఈ సర్వేలో ప్రతి పది మందిలో నలుగురు అధిక బరువుతో బాధ పడుతున్నారు. సుమారు 40 శాతం పెద్ద వయసు పురుషులు, మహిళలు అధిక బరువు, ఊబకాయంతో ఉన్నారు. 18 శాతం మంది మహిళలు, 20 శాతం మంది పురుషులు ప్రస్తుతం షుగర్ వ్యాధితో బాధ పడుతున్నారు. కుటుంబాలకు అందే బీమా కవరేజీ మాత్రం 41% నుంచి 60.2% కి పెరిగింది. 90 శాతం ప్రసవాలు దవాఖానల్లో జరుగుతుంటే ఇంకా 10 శాతం బయటి ప్రాంతాల్లోనే జరగడం గమనార్హం.

# ఒక కుటుంబానికి ఒకే గ్యాస్ కనెక్షన్..

తమ వద్ద అదనంగా ఉన్న గ్యాస్ సిలిండర్లను వెంటనే అప్పగించాలని విజ్ఞప్తి చేశాయి. ఒక వంట గదితో ఉండే ఒక కుటుంబం (భర్త, భార్య, పెళ్లయిన పిల్లలు, తల్లిదండ్రులు)కు ఒక్క ఎల్పీజీ కనెక్షన్‌ను మాత్రమే అనుమతిస్తారు. అంతే కాకుండా అదనపు సిలిండర్లను కనుక కంపెనీలకు అప్పగించకపోతే వారి అసలు కనెక్షన్‌కు కూడా గ్యాస్ సరఫరా నిలిపివేస్తారు. సిలిండర్లను అప్పగించిన తర్వాతే సరఫరాను పునరుద్ధరిస్తారు. అయితే అదనపు సిలిండర్‌ను తిరిగి అప్పగించిన తర్వాత వినియోగదారులు ఒక బ్యాకప్ సిలిండర్ కోసం డబుల్ బాటిల్ కనెక్షన్‌గా మార్చుకోవడాన్ని ఎంచుకోవచ్చు. ఒక వేళ వినియోగదారులు పీఎన్‌జీ కనెక్షన్‌ను కనుక పొందదలిస్తే తమ ఎల్పీజీ కనెక్షన్‌ను 30 రోజుల్లోగా అప్పగించాలి. ప్రత్యామ్నాయంగా వారు బదిలీ వోచర్‌ను అభ్యర్థించ వచ్చు. దీని ద్వారా పీఎన్‌జీ అందుబాటులో లేని ప్రాంతంలో ఎల్పీజీ కనెక్షన్‌ను తిరిగి క్రియాశీలం చేయడం సాధ్యమవుతుంది. గ్యాస్ వినియోగాన్ని నియంత్రించడానికి, దుర్వినియోగాన్ని అరికట్టడానికి ఈ చర్యలు తీసుకుంటున్నట్టు కేంద్రం ప్రకటించింది.

# హోర్ముజ్ నిర్వహణ హక్కు మాదే

మొదటి తరువాయి

**ట్రంప్ ఏమన్నారంటే...**

పశ్చిమాసియా ఘర్షణపై శ్వేతసౌధంలో జరిగిన కీలక సమావేశానికి హాజరయ్యే ముందు ట్రంప్ మాట్లాడుతూ హోర్ముజ్‌లో నౌకల రాకపోకలపై విధించిన ఆంక్షలు తొలగిపోయాయని చెప్పారు. ఆ జలసంధిలో సముద్ర రవాణా సాధారణ స్థితికి చేరుతోందని తెలిపారు. 'హోర్ముజ్‌లో మిగిలిపోయిన మందుపాతరలను తక్షణమే ఇరాన్ తొలగిస్తుంది. అవి అక్కడ పెద్దగా లేకపోవచ్చు. మా అసాధారణ నౌకా దిగ్బంధనం కారణంగా జలసంధిలో చిక్కుకుపోయిన నౌకలు స్వదేశాలకు తరలిపోతున్నాయి. మీ కుటుంబసభ్యులకు నా తరఫున...మీ అభిమాన అధ్యక్షుడి తరఫున హలో చెప్పండి' అంటూ తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో ఆయన రాశారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకూ హోర్ముజ్‌లో నౌకల నుంచి ఇరాన్ ఎలాంటి రుసుము వసూలు చేయదని అన్నారు. అంతగా ప్రాధాన్యత లేని మిగిలిన అంశాలపై ఇరాన్‌తో అంగీకారం కుదిరిందని తెలిపారు.

**ఇరాన్ ఏమంది?**

ట్రంప్ వ్యాఖ్యలను ఇరాన్ మీడియా తోసిపుచ్చింది. హోర్ముజ్‌ను తిరిగి తెరిచే విషయంపై చేసుకునే ఒప్పందంలో నౌకల పర్యవేక్షణ'తనిఖీ, సేవల నిబంధనలు, భద్రతా చర్యలు విధిగా ఉంటాయని స్పష్టం చేసింది. రుసుములు, షరతులు లేకుండా హోర్ముజ్‌ను తిరిగి తెరిచేందుకు ఇరాన్ అంగీకరించిందన్న వార్తలను ఖండిస్తూ ముసాయిదాలో అలాంటి క్లాజు ఏదీ లేదని తెలిపింది. ఇరాన్ నౌకల దిగ్బంధాన్ని ఎత్తివేస్తేనే హోర్ముజ్‌ను టెహ్రాన్ తిరిగి తెరుస్తుందని మీడియా కథనాలు చెబుతున్నాయి. ఇరాన్ తన వద్ద ఉన్న అణు పదార్థాలను ధ్వంసం చేస్తుందంటూ ట్రంప్ చేస్తున్న వాదనలో నిజం లేదని కూడా ఫార్స్ న్యూస్ చెప్పింది. చర్చల దశలో ఉన్న అవగాహనా పత్రంలో అలాంటి అంశమే లేదని తెలిపింది. విదేశాలలో స్తంభింపజేసిన 12 బిలియన్ డాలర్ల ఇరాన్ ఆస్తులను తక్షణమే విడుదల చేయాలన్న డిమాండ్ ముసాయిదాలో కీలక భాగంగా ఉన్నదని టెహ్రాన్ అధికారులను ఉటంకిస్తూ ఆ వార్తా సంస్థ పేర్కొంది. నిధులను విడుదల చేయని పక్షంలో చర్చల తదుపరి దశకు ఇరాన్ కదలబోదని స్పష్టం చేసింది. హెజ్బొల్లాలు కోరుతున్న విధంగా లెబనాన్‌లో కూడా పూర్తిగా కాల్పుల విరమణను పాటించాలన్న డిమాండ్ కూడా చర్చలలో ఉన్నదని తెలిపింది.

# మోటర్లకు మీటర్లు పెడితే ఎన్నికల్లో పోటీచేయను

మొదటి తరువాయి

రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. మోటార్లకు మీటర్లు పెడితే, రైతులకు ఉచిత విద్యుత్ నిలిపివేస్తే.. తాము ఎన్నికల్లో పోటీ చేయబోమన్నారు. తాము ఉచిత విద్యుత్ కొనసాగిస్తే.. బీఆర్ఎస్ ఎన్నికలకు దూరంగా ఉంటుందా అని సిఎం రేవంత్ సవాల్ విసిరారు. రైతుల ముసుగులో కేసీఆర్ రాజకీయ లబ్ధికి యత్నిస్తున్నారని ఆరోపించారు. అన్నదాతలకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించేందుకే రైతు డిస్కం ఏర్పాటు చేస్తున్నాం. ఉచితంగా అందిస్తున్న విద్యుత్ వినియోగాన్ని దీనికి కనెక్ట్ చేస్తున్నాం. రైతు డిస్కంతో జవాబుదారీతనం పెరుగుతుందన్నారు. వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టాలని ప్రధాని మోడీ ఎప్పుడూ చెప్పలేదన్నారు. ఇది చెప్పకున్నా బిఆర్ఎస్ తన రాజకీయ లబ్ది కోసం పదేపదే దీనిని వాడుకుందని ఆరోపించారు. ఎపిలో కూడా జగన్ స్మార్ట్ మీటర్లు పెడతానని ఎప్పుడూ చెప్పలేదన్నారు. ఇకపోతే మేం ఏడాదికి రూ.70 వేల కోట్లు అప్పు చేస్తే.. రూ.95 వేల కోట్ల అప్పు తీరుస్తున్నాం. మేం తీరుస్తున్న అప్పుల గురించి హరీశ్‌రావు చెప్పడం లేదు. రూ.54 వేల కోట్లు అప్పులు తీసుకుంటామని ముందే చెప్పాం. ఎఫ్ఆర్‌బీఎం పరిధి దాటి అప్పులు చేయడానికి అనుమతి లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి వదిలేసిందే తప్ప ఒక్క గింజ కూడా కొనడం లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో వరి, జొన్న, మొక్కజొన్న పంటలను తమ ప్రభుత్వమే పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తోందని, ఇప్పటివరకు 62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. తడిచిన ధాన్యానికి సైతం మద్దతు ధర కల్పిస్తున్నామని,



సన్న వడ్లకు బోనస్ ఇస్తామని భరోసా ఇచ్చారు. బీజేపీ నేతలు ఢిల్లీకి బస్సులు వేసుకుని వెళ్లి ధాన్యం కొనుగోలుకు ఒత్తిడి తేవలన్నారు. లేకుంటే తాము వారి ఇళ్ల ముందుకే ట్రాక్టర్లతో వడ్లు తెచ్చి పోస్తామని ఆయన హెచ్చరించారు. అంతర్రాష్ట్ర జల వివాదాలపై ప్రధాని మోదీ మాటలు చెబుతున్నా, తుమ్మిడిహట్టి కోసం మహారాష్ట్ర సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ఆక్షేపించారు. కేంద్రంలోని భాజపా సర్కారు వడ్లు సరిగ్గా కొనుగోలు చేయడం లేదు. రాష్ట్రంలో 32 శాతం ధాన్యం మాత్రమే కొంటోంది. ధ్యాన్యం కొనకపోతే భాజపా నేతల ఇళ్ల ముందు ధాన్యం పోస్తాం. అంతర్రాష్ట్ర జలవివాదాలను సహకార ధోరణితో పరిష్కరించుకోవాలని ప్రధాని మోదీ చెబుతున్నారు. ప్రాణహిత ప్రాజెక్టుపై మహారాష్ట్ర సీఎంతో చర్చలకు ప్రయత్నిస్తున్నాం. ఆయన ఎందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదన్నారు. హరీష్ రావు ఇదులకుంట చెరువు అక్రమాలపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఎన్టీఆర్ విగ్రహం చుట్టూ ప్రాంతీయ, కుల వివాదాలు చేయడం బుద్ధిలేనితనమని, తన దృష్టి అంతా అభివృద్ధి పైనే ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కేసీఆర్ మీద ఒట్టేసి.. బీఆర్ఎస్‌లోనే ఉంటానని హరీశ్‌రావు చెప్పాలన్నారు. గతంలోనూ హరీశ్‌రావు.. వైఎస్సార్ దగ్గరికి వెళ్లారు. ఆయన ఎవరెవరితో మాట్లాడుతున్నారో నాకు తెలుసు.. కానీ చెప్పను. ఇటీవల పార్టీ మీటింగ్ వదిలేసి ఆయన దిల్లీకి ఎందుకు వెళ్లారు? భాజపా, బీఆర్ఎస్‌లు కలిసి పోటీ చేస్తాయనడంలో అనుమానమే లేదు. సీబీఎస్ఈలో జవాబపత్రాలు తారుమారు చేసిన గ్లోబరీనా.. కేటీఆర్ బినామి సంస్థ. గ్లోబరీనా సంస్థ కేటీఆర్ బినామీదేనని ఆరోపించిన సీఎం అదే ఇప్పుడు పేరు మార్చుకుందన్నారు. 2034 వరకు రాష్ట్ర రాజకీయాల్లోనే ఉంటాను. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, నాది విజయవంతమైన కాంబినేషన్. మేం అన్ని ఎన్నికలు గెలిచాం. భవిష్యత్తులోనూ విజయం సాధిస్తాం. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆయనకు మంచి పదవి రావొచ్చు. జీహెచ్ఎంసీ ఎన్నికలకు ఇప్పుడే తొందర లేదు. ఎన్టీఆర్‌ను కులం, ప్రాంతంతో పోల్చడం బుద్ధిలేనితనం. పొట్టి శ్రీరాములు వర్సిటీకి సురవరం పేరు పెట్టిందే నేను. వివాదాలు, సెంటిమెంట్‌తో రాజకీయాలు చేయాలని అనుకోవడం లేదని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు.

# బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ అరెస్ట్

**-సింగరేణిపై.. అనుచిత వ్యాఖ్యలు**
**-తెలంగాణ భవన్ వద్ద హైటెన్షన్**
**-పోలీసులను అడ్డుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు**

**హైదరాబాద్,**

సింగరేణి సంస్థపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ పార్టీ కీలక నేత బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఉండగా పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని నాంపల్లి కోర్టుకు తరలించారు. అంతకు ముందు బాల్క సుమన్‌ను అరెస్ట్ చేసేందుకు పోలీసులు శనివారం ఉదయం తెలంగాణ భవన్ దగ్గరకు వెళ్లారు. ఈ నేపథ్యంలో తెలంగాణ భవన్ దగ్గర ఉద్రిక్తత చోటుచేసుకుంది. బీఆర్ఎస్ భవన్‌లో ఉన్న బాల్క సుమన్‌ను అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో బీఆర్ఎస్ కార్యకర్తలు వారిని అడ్డుకున్నారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలను పోలీసులు చెదరగొట్టారు. అనంతరం సుమన్‌ను అరెస్ట్ చేసి




పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

**పలు సెక్షన్ల కింద కేసులు**

బాల్క సుమన్‌పై 326(g), 351(3), 353(1)(ఎ), r/w55, r/w 61(2)(a), ఎఅం 4 pdppa కింద కేసు నమోదైంది. ఆనంద్ అనే వ్యక్తి బాల్క సుమన్‌పై నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బొగ్గు గని కార్మికుల సమావేశంలో బాల్క సుమన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ ఫిర్యాదులో పేర్కొన్నాడు. 'సింగరేణిని తగలపెట్టండి. మిలిటెంట్ యాక్టివిటీ చేయాలి. ఆఫీసులను తగలబెడదాం. నెల రోజులు జైలుకు పోయి వస్తాము' అని బాల్క సుమన్ కామెంట్ చేసినట్లు ఆనంద్ తెలిపాడు.

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే జైలుకు పంపుతున్నారు: బాల్క సుమన్

పోలీసులు అరెస్ట్ చేయడానికి ముందు బాల్క సుమన్ మీడియాతో మాట్లాడుతూ.. నేను ఎక్కడికీ పారిపోలేదు. తెలంగాణ భవన్‌లోనే ఉన్నా. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే జైలుకు పంపుతున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో నాపై 250కి పైగా కేసులు పెట్టారు. క్యాతనపల్లి ఎన్నిక సమయంలోనూ నన్ను జైల్లో పెట్టారు. ఇప్పుడు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నన్ను టార్గెట్ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రశ్నిస్తూనే ఉంటాం. సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలు ఇస్తామన్నారు. దానినే ప్రశ్నిచ్చా. మరోసారి నన్ను జైలుకు పంపాలని రేవంత్, వివేక్ ప్రయత్నిస్తున్నారు. నన్ను జైలుకు పంపి పైశాచిక ఆనందం పొందాలని చూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రశ్నిస్తూనే ఉంటాం' అని అన్నారు.

# కర్నాటక సీఎంగా డీకే శివకుమార్

మొదటి తరువాయి

సీఎల్పీ నేతగా డీకే శివకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఏఐసీసీ పరిశీలకులు ప్రకటించారు. కాగా కేవలం పది నిమిషాల్లోనే సీఎల్పీ భేటీ ముగియడం గమనార్హం.

జూన్ 3న ప్రమాణ స్వీకారం

కర్నా టక కొత్త సీఎం డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారోత్సవం జూన్ 3న జరగనుంది. ఈ విషయాన్ని కర్నా టక కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు జీసీ చంద్రశేఖర్ ప్రకటించారు. కొత్త ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమం లోక్‌భవన్‌లో జరుగనుందన్నారు. ఈ కార్యక్రమాన్ని నిరాడంబరంగా నిర్వహించాలనే ఉద్దేశంతోనే సీఎం ప్రమాణస్వీకారోత్సవ వేదికను లోక్‌భవన్‌కు మార్చినట్టు చంద్రశేఖర్ తెలిపారు. ట్రాఫిక్ రద్దీ తలెత్తకుండా, ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు ఎవరు కూడా లోక్‌భవన్‌కు రావద్దన్నారు. పార్టీ నిర్ణయానికి అందరూ సహకరించాలని కోరారు.

గవర్నర్ తో డీకే భేటీ

లోక్‌భవన్‌లో శనివారం ఉదయం గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్‌తో డీకే శివకుమార్ భేటీ అయ్యారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపైనే వీరిద్దరి మధ్య ప్రధానంగా చర్చ జరిగినట్టు సమాచారం. గవర్నర్ ఆదివారం ధర్మస్థలలో జరిగే ఉపరాష్ట్రపతి పర్యటనకు హాజరుకావాల్సి ఉన్న నేపథ్యంలో ఆయన బెంగళూరు వెళున్నారు. గవర్నర్ అందుబాటులో ఉండరనే ఉద్దేశంతోనే, సీఎల్పీ సమావేశానికి ముందే డీకే ఆయనతో భేటీ అయినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.

# మోసపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

మొదటి తరువాయి

మేలుకోలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానం గతంలో ఎలా ఉండేదో ఇప్పుడు అలానే ఉందని విమర్శించారు. రైతుల దగ్గర నుంచి కేంద్రం నేరుగా కొనదు.. మీ దద్దమ్మ తనం కేంద్రం మీద మోపుతున్నారని మండిపడ్డారు. దొడ్డు బియ్యం పండించే రైతుల పరిస్థితి ఏందని ప్రశ్నించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రైతులతో ఆడుకుంటున్నాయని.. ఈ ప్రభుత్వానికి కాంట్రాక్టులు, కమిషన్లు, భూ దందాల మీద ఉన్న దృష్టి రైతుల మీద లేదని విమర్శించారు. ఆ మంత్రి ఎంత ఈ మంత్రి ఎంత కమిషన్ తీసుకున్నారు.. నేనెంత తీసుకోవాలని చర్చిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. దేశ వ్యాప్తంగా విపరీతంగా ధాన్యం ఉత్పత్తి జరిగిందని.. ఎక్కడ గోదాంలు ఖాళీగా లేవని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. 'విదేశాలకు సప్లై చేయాలి అంటే పెస్టిసైడ్ వాడ కూడదు. క్షేత్ర స్థాయిలో ఆర్గానిక్ ఫార్మింగ్‌పై అవగాహన కల్పిస్తుందా? రైతుల ఉసురు తీసుకుంటుంది ఈ ప్రభుత్వం.

ఆంధ్రప్రదేశ్‌లో ఈ సమస్య ఎందుకు లేదు. 6 నెలల ముందు గన్ని బస్తాలు తెచ్చుకుంటే ఏమయ్యింది. ఇక్కడ పండే సన్న బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు సప్లై చేస్తున్నారు. ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. తక్కువ ధరకు ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చి ఇక్కడ నాశి రకం సన్న బియ్యాన్ని పేద ప్రజలకి అందిస్తున్నారు. పేదలను, రైతులను మోసం చేస్తున్నారు. అందరికీ కేంద్రాన్ని విమర్శించడం అలవాటు అయింది. ఇతర రాష్ట్రాల కన్నా ఎక్కువ ధాన్యాన్ని తెలంగాణ నుంచి కేంద్రం తీసుకుంది. ఈ ప్రభుత్వం రైతులను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని అనుకుంటుంది. ఆర్గానిక్ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని ప్రధాని పదేపదే చెపుతున్నారు. ధాన్యం సేకరణపై కేంద్రం గతంలో 9 సార్లు పొడిగింపు ఇచ్చింది. ఎప్పుడూ ఇచ్చిన టార్గెట్ పూర్తి చేయలేదు. రైస్ మిల్లర్లతో కుమ్మక్కు అయ్యారు. గతంలో బీర్ఎస్ అదే పని చేసింది. కేంద్రం ఇప్పటి వరకు ఇచ్చిన కోటను పూర్తి చేయలేదు. 52.24 లక్షల మెట్రిక్ టన్నులు కేంద్రంతో ఒప్పందం జరిగింది. ఇప్పటి వరకు 51 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వివరించారు.

# సీఎం రేవంత్.. జిల్లాల టూర్

ఈ సందర్భంగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. కాగా, తెలంగాణ ప్రభుత్వం కోహెడలో 239 ఎకరాల్లో అత్యాధునిక సౌకర్యాలతో మార్కెట్‌ను నిర్మించింది. ఆ తర్వాత అదే రోజు మహబూబ్‌నగర్ జిల్లాలో సీఎం రేవంత్ పర్యటిస్తారు. రాత్రికి సోమశిలలో బస చేయనున్నారు. జూన్ 4న జూరాల, నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పనులను పరిశీలిస్తారు. నార్లాపూర్, వట్టెం, ఏదుల రిజర్వాయర్లను సందర్శించి పెండింగ్ ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించనున్నారు. జూన్ 5న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో మహిళా సంఘాలకు బస్సులను రేవంత్ రెడ్డి పంపిణీ చేయనున్నారు. రూ.199 కోట్లతో కొనుగోలు చేసిన 553 బస్సులను మహిళలకు అందించనున్నారు. కాగా, మహిళా సంఘాలకు బస్సులు అందించి, వాటిని తెలంగాణ ఆర్టీసీకి అద్దెకు ఇచ్చే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది.

## ఒక్క ఏడాది ఆగండి..కాంగ్రెస్‌కు మిత్తితో చెల్లిద్దాం

మొదటి తరువాయి

ఇల్లు కట్టకపోగా, హైడ్రాను తెచ్చి వేలాది ఇండ్లను కూలగొట్టారని ఆరోపించారు. ఒక్క ఏడాది కష్టపడండి చాలు కాంగ్రెస్ పాలకులకు మిత్తితో సహా చెల్లించే సమయం వస్తుందని వ్యాఖ్యానించారు. కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న సర్ పట్ల పార్టీ కార్యకర్తలు అందరూ అప్రమత్తంగా ఉంటూ అర్హుల ఓట్లు పోకుండా చూడాలని చెప్పారు. ముషీరాబాద్ నియోజక వర్గ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం శనివారం ఓ ఫంక్షన్ హాలులో ఎమ్మెల్యే ముఠా గోపాల్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేటీఆర్ ప్రత్యేక ఓటర్ సవరణ, బీఆర్ఎస్ పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదు పట్ల పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలపై రాహుల్ గాంధీనీ యువత నిలదీయాలన్నారు. తెలంగాణ యువతకు మా కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేస్తే తిరిగి వచ్చి అండగా నిలబడతానని మాయమాటలు చెప్పిన రాహుల్ గాంధీ ఇప్పుడు ఎటు పోయారని ప్రశ్నించారు. పార్టీ తరఫున ఎంపిక చేసిన బీఎల్ఏలు ఏ ఒక్కరి ఓటు తొలగకుండా కాపాడే ప్రయత్నం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి అర్.ఎస్ ప్రవీణ్ కుమార్, పార్టీ నేతలు ఎమ్మెన్ శ్రీనివాస్, ముఠా జై సింహ, నాగేష్ ముదిరాజ్, ఎడ్ల హరిబాబు యాదవ్, ముచ్చకుర్తి ప్రభాకర్, బూత్ కమిటి ప్రతినిధులు పాల్గొన్నారు.

## దేశానికి “ధర్మ హింస” అవసరమే..

మొదటి తరువాయి

. భారతీయ తత్వశాస్త్రంలో “అహింసా పరమో ధర్మః, ధర్మ హింసా తథైవ చ” అనే సూక్తిని యోగి ప్రస్తావించారు. దీని అర్థం అహింస గొప్ప ధర్మమే అయినప్పటికీ, ధర్మాన్ని కాపాడటానికి అవసరమైన హింస కూడా ధర్మమే అనే భావన. ఈ సిద్ధాంతాన్ని భారతీయ ఇతిహాసాలు, పురాణాలు కూడా ప్రతిపాదించాయని ఆయన అన్నారు. అన్యాయం, అధర్మం, దుర్మార్గాన్ని నిర్మూలించేందుకు అవసరమైన సందర్భాల్లో శక్తిని వినియోగించడం సమాజ ప్రయోజనాల దృష్ట్యా సమర్థనీయమని వివరించారు. దేశ భద్రత విషయంలో భారత సైన్యం, భద్రత బలగాల పాత్రను యోగి ప్రత్యేకంగా ప్రశంసించారు. దేశ భద్రతను కాపాడటంతో పాటు అంతర్గత భద్రతను పరిరక్షించడంలో భద్రతా దళాలు చేస్తున్న త్యాగాలు అమూల్యమని అన్నారు. ఉగ్రవాదం, తీవ్రవాదం, దేశ వ్యతిరేక కార్యకలాపాలను ఎదుర్కొనే సమయంలో కేవలం శాంతి సందేశాలు సరిపోవని, అవసరమైన చర్యలు తీసుకోవాలనేదేనని పేర్కొన్నారు. యోగి వ్యాఖ్యలు భారతదేశ భద్రత విధానానికి సంబంధించిన విస్తృత చర్చ దారితీశాయి. ఒకవైపు శాంతి, అహింస వంటి విలువలను కాపాడటూనే, మరోవైపు దేశ ప్రయోజనాలకు ముప్పు కలిగించే శక్తులపై కఠిన వైఖరి అవలంబించాల్సిన అవసరాన్ని ఆయన గుర్తుచేశారు. ప్రజాస్వామ్యంలో శాంతియుత సహజీవనం అత్యంత ముఖ్యమైనదే అయినప్పటికీ, దేశ సమగ్రత, ప్రజల భద్రత విషయంలో రాజీ పడకూడదనే సందేశాన్ని ఆయన ఇచ్చారు.

# దేవరకొండలో 'ఇందిరమ్మ చీరల' పంపిణీ

**-మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ చేతుల మీదుగా ప్రారంభం .**



**దేవరకొండ మే 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్).** దేవరకొండ పురపాలక సంఘం పరిధిలో అర్హులైన మహిళలకు 'ఇందిరమ్మ చీరల పంపిణీ' కార్యక్రమం శనివారం మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ ముఖ్య అతిథిగా హాజరై, తన చేతుల మీదుగా మహిళలకు చీరలను పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ,మొదటి విడతలో భాగంగా పట్టణ పరిధిలోని మెప్మా మహిళా స్వయం సహాయక సంఘ సభ్యులకు ఈ చీరలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం, పట్టణంలోని ఫుడ్ సెక్యూరిటీ కార్డు (రేషన్ కార్డు) కలిగి ఉండి, 18 సంవత్సరాలు నిండిన మహిళలందరికీ ఇట్టి చీరలను అందజేయడం జరుగుతుందని ఆమె వివరించారు.పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, పంపిణీ ప్రక్రియను సులభతరం చేసేందుకు పురపాలక సంఘంలోని 20 వార్డులలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు చైర్మన్ తెలిపారు. జూన్ 2, 2026 వరకు ఈ కౌంటర్లు అందుబాటులో ఉంటాయని, మెప్మా రిసోర్స్ పర్సన్లు మరియు వార్డులకు కేటాయించిన ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో పంపిణీ అత్యంత పారదర్శకంగా జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. అర్హులైన మహిళలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ విశేష కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామదుర్గా రెడ్డి, వైస్ చైర్మన్ జువేరియా తబస్సుమ్, మున్సిపల్ కౌన్సిలర్లు చంద్రకళ, మాధవి, సావిత్రి, సుమలత, పద్మ, అంకులమ్మ, శ్రీకన్య, భవాని, యూనుస్, అజయ్ చంద్ర, సాయిచంద్ర గౌడ్, రూప్ల నాయక్, నవీద్, మెప్మా టీఎంసీ జగమంతు, మెప్మా ఆర్.పీలు మరియు మున్సిపల్ సిబ్బంది, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని సీపీఐ నిరసన




**పెద్దపల్లి, మే 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలకు నిరసనగా సీపీఐ మాస్ లైన్ ప్రజా పంథా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆందోళన జరిగింది. ఈ సందర్భంగా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ మాట్లాడుతూ, మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం పేద ప్రజలపై భారాన్ని మోపుతూ, కార్పొరేట్ కంపెనీలకు లాభాలు చేకూరుస్తోందని విమర్శించారు. క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినా, ఇంధన ధరలు పెంచడం సిగ్గుచేటు అని అన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో కూలీలు, నిరుద్యోగులు, ఉద్యోగస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజలు సోషల్ మీడియా ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీయాలని, ఇంధన ధరల పెంపును వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలని సీపీఐ ఎంఎల్ నేతలు డిమాండ్ చేశారు.

## ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలమైందని టీఆర్ఎస్ విమర్శలు




**పెద్దపల్లి, మే 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టీఆర్ఎస్ పార్టీ జిల్లా ఇంఛార్జ్ సలేంద్ర యాదవ్ విమర్శించారు.జిల్లా ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తేమ, తాలు పేరుతో కొనుగోళ్లు ఆలస్యం చేస్తుండటంతో రైతులు కేంద్రాల్లో రోజులు గడపాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గోనె సంచులు, లారీల కొరతతో పాటు అకాల వర్షాల కారణంగా ధాన్యం నష్టపోతుందని, రైతులు అప్పులు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని అన్నారు.రైతులకు తగిన న్యాయం చేయాలని, వరి, మొక్కజొన్న కొనుగోళ్లను తక్షణం వేగవంతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో జిల్లా నాయకులు బొల్లం భూమేష్, చిట్టిమల్ల హనుమాన్లు, కల్వల రవీందర్, కళ్ళ తిరుపతి, అంబాల మహేష్, గడ్డం నరసింహులు, బుడిగె మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.రైతుల కష్టాన్ని గుర్తించి తక్షణమే కొనుగోళ్లు వేగవంతం చేయాలని టీఆర్ఎస్ నేతలు ప్రభుత్వాన్ని కోరారు.

## ఎస్ఐగా పదోన్నతి పొందిన ఏఎస్ఐ మల్లేశంకి ఘన సత్కారం



**గంగాధర, మే 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

గంగాధర పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేసిన మొగిలి మల్లేశంకి ఎస్ఐ పదోన్నతి లభించి సిరిసిల్లకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ వంశీకృష్ణ ఆధ్వర్యంలో ఘన సత్కార కార్యక్రమం జరిగింది.పోలీస్ సిబ్బంది ఆయన క్రమశిక్షణ, విధి నిర్వహణలో చూపిన నిబద్ధతను ప్రశంసిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. సిరిసిల్లలో కొత్త బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తించాలని ఆకాంక్షించారు.మల్లేశం మాట్లాడుతూ, తన సేవాకాలంలో సహకరించిన ఉన్నతాధికారులు, సహచరులకు కృతజ్ఞతలు తెలిపారు. గంగాధర పోలీస్ స్టేషన్‌తో తనకు ఉన్న అనుబంధాన్ని ఎప్పటికీ మర్చిపోలేనని పేర్కొన్నారు.పదోన్నతి సందర్భంగా గంగాధర పోలీస్ స్టేషన్‌లో సత్కారం ఉత్సాహభరితంగా జరిగింది.

## ఎలిగేడు లో సీఐటీయూ 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**-కార్మికుల ఐక్యతకు ప్రతీకగా జెండా ఆవిష్కరణ**



**ఎలిగేడు, మే 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండల కేంద్రంలో శనివారం సీఐటీయూ 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జీపీ కార్మికుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా సీఐటీయూ జెండాను ఆవిష్కరించి, స్వీట్లను పంపిణీ చేశారు. కార్మికుల ఐక్యతను ప్రతిబింబించేలా కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.కార్యక్రమంలో జీపీ కార్మికుల మండల అధ్యక్షుడు తీట్ల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు ఇరుగురాల లచ్చయ్య, నాయకులు కవ్వంపల్లి దేవేందర్, ఆసంపల్లి చంద్రయ్య, రాయపాక లక్ష్మన్, నర్సయ్య, సబ్బు లచ్చయ్య, మల్లయ్య, కొండయ్య, రమేశ్, ఇరుగురాల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ శ్రేణుల బైఠాయింపు

**రైతులకు అన్యాయం జరిగిందని ఆందోళన**


తహసీల్దార్ కు వినతిపత్రం ఇస్తున్న బి.ఆర్.ఎస్ నాయకులు


బి ఆర్ ఎస్ శ్రేణుల బైఠాయింపు


రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ

**ఎలిగేడు, మే 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండలంలోని పీఏసీఎస్, ఐకేపీ ద్వారా వరి ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ తూకం వేసి రైతులను మోసం చేసి ఆర్థిక నష్టం కలిగించారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ మండల పార్టీశాఖ ఆధ్వర్యంలో శ్రేణులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా వారు కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. "నిబంధనల ప్రకారం ఒక్కో బస్తాకు 40 కిలోల 650 గ్రాములు తూకం వేయాలి. కానీ రైస్ మిల్లర్లు, నిర్వాహకులు 41 కిలోల 500 గ్రాముల నుండి 42 కిలోల వరకు తూకం వేసి రైతులను నష్టపరుస్తున్నారు" అని వారు ఆరోపించారు.ఆందోళనలో మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతి మోహన్ రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రామిరెడ్డి, సుల్తానాపూర్ సర్పంచ్ కవ్వంపల్లి బాపయ్య, మాజీ సర్పంచులు రాచర్ల కొండయ్య, తంగెళ్ల స్వప్న కుమార్, చిలుముల లక్ష్మణ్, ఉప సర్పంచ్ తానిపర్తి రమేష్ రావు, నాయకులు న్యాతరి పోచాలు, బాసంపల్లి వినోద్, నారగోని విజయకుమార్, బోయిని సత్యం, నర్సింగం, రాజేష్, పంగ రవి, గొల్లె లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## మహేశ్వరం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన సీపీ తరుణ్ జోషి

**కేసుల దర్యాప్తులో వేగం పెంచాలని సూచనలు**



**మహేశ్వరం, మే 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఫ్యూచర్ సిటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ తరుణ్ జోషి శనివారం సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన స్టేషన్ పరిసరాలను పరిశీలించి, పోలీస్‌స్టేషన్‌లో నమోదవుతున్న వివిధ కేసుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల స్థితిగతులు, ప్రజలకు అందిస్తున్న సేవలపై సమీక్ష నిర్వహించారు.సీపీ తరుణ్ జోషి మాట్లాడుతూ, "కేసుల దర్యాప్తులో వేగం పెంచి బాధితులకు సత్వర న్యాయం అందించాలి. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సకాలంలో స్వీకరించి పారదర్శకంగా పరిష్కరించాలి. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి" అని సూచించారు.అలాగే, నేరాల నియంత్రణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు మరింత కృషి చేయాలని ఆయన ఆదేశించారు. "ప్రజల విశ్వాసాన్ని పెంచే విధంగా సేవలు అందించడం పోలీసుల ప్రధాన లక్ష్యం కావాలి" అని పేర్కొన్నారు.ఈ సందర్భనలో ఫ్యూచర్ సిటీ డీసీపీ నారాయణ రెడ్డి, మహేశ్వరం ఎస్‌హెచ్‌వో, సీఐ రాఘవేందర్ రెడ్డి, ఎస్సైలు ప్రసాద్, రాఘవేందర్, ధనుంజయ్, కానిస్టేబుల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆటపాటలతో చదువు నేర్చుకునే బడి అంగన్వాడి

**చిన్నారుల భవిష్యత్తుకు పటిష్టమైన పునాది**



**ఎలిగేడు, మే 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** "ఆటపాటలతో చదువు నేర్చుకునే బడి అంగన్వాడి కేంద్రం" అని ఐసీడీఎస్ సూపర్వైజర్ సూర్యకళ అన్నారు. మూడు నుండి ఐదేళ్ల లోపు పిల్లలందరిని తప్పనిసరిగా అంగన్వాడి కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.ప్రజాపాలనలో భాగంగా శనివారం ఎలిగేడు మండల కేంద్రంలోని అంగన్వాడి కేంద్రం--1లో "అమ్మమాట--అంగన్వాడి బాట" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యకళ మాట్లాడుతూ, "అంగన్వాడి కేంద్రాల్లో పిల్లలకు చదువుతో పాటు పౌష్టికాహారం అందుతుంది. ఇది వారి భవిష్యత్తును పటిష్టంగా నిలబెడుతుంది. ప్రస్తుతం అన్ని అంగన్వాడి కేంద్రాల్లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. బడి పిల్లలకు యూనిఫాంలు కూడా అందజేస్తున్నాం" అని తెలిపారు.తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్వాడి కేంద్రాలకు పంపించి సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ జ్యోతి, చిన్నారులు, మహిళలు పాల్గొన్నారు.

## కులవివక్షత పాటిస్తే చర్యలు తప్పవు -- తహసీల్దార్ యాకన్న

**-సామరస్య వాతావరణంలో జీవించాలని పిలుపు**



**ఎలిగేడు, మే 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గ్రామాల్లో కుల, మత తారతమ్య భేధాలు లేకుండా ప్రజలంతా సామరస్య వాతావరణంలో కలిసి మెలసి జీవించాలని తహసీల్దార్ యాకన్న సూచించారు. "కులవివక్షత పాటిస్తే కఠిన చర్యలు తప్పవు" అని ఆయన హెచ్చరించారు. ఎలిగేడు మండలం లాలపల్లిలో శనివారం నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రజలందరూ సమానత్వంతో జీవించాలన్న సందేశాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ ఏలేటి వెంకట్రెడ్డి, ఎంపీడీవో భాస్కరరావు, ఎస్సీ వెల్ఫేర్ అధికారి అంజయ్య, ఏఎస్సై శ్రీనివాస్, ఆరఐ జయలక్ష్మి, జీపీవో అనిల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి సురేశ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

## సీసీపీఎల్ క్లబ్ లీగ్ చాంపియన్‌గా వైకింగ్స్ పీసీ



**హైదరాబాద్, మే 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

నగరంలో పది వారాల పాటు సాగిన సీసీపీఎల్ క్లబ్ లీగ్ హైదరాబాద్ టోర్నీలో వైకింగ్స్ పీసీ చాంపియన్‌గా నిలిచిందని సెంటర్ కోర్ట్ స్పోర్ట్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సహ వ్యవస్థాపకులు యశ్వంత్ బియ్యాల, విక్రాంత్ రావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ నగరంలోని క్రాస్‌కోర్ట్స్ స్పోర్ట్స్ క్లబ్‌లో జరిగిన ఫైనల్లో వైకింగ్స్ పీసీ 4-0 తేడాతో పెంగ్విన్ పీసీపై ఘన విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుందని తెలిపారు. కాన్ఫరెన్స్-ఎ ఫైనల్లో పెంగ్విన్ పీసీ 4-2తో డీఆర్‌సీ స్పోర్ట్స్ ఫౌండేషన్ ను ఓడించి ఫైనల్ చేరగా, కాన్ఫరెన్స్-బి ఫైనల్లో వైకింగ్స్ పీసీ 3-3తో బిల్డ్ క్రూతో సమంగా నిలిచి, గేమ్ బ్రేకర్‌లో 25-22తో గెలిచి టైటిల్ పోరుకు అర్హత సాధించిందని తెలిపారు. ఈ లీగ్‌లో 350 మందికిపైగా ఆటగాళ్లు పాల్గొనగా, 92 మంది మహిళలు ఉన్నట్లు చెప్పారు. 220కిపైగా మ్యాచ్‌లు నిర్వహించగా, 8 వేల మందికిపైగా క్రీడాభిమానులు వీక్షించారని తెలిపారు.

# ఘనంగా పౌర హక్కుల దినోత్సవం వేడుకలు



**గంగాధర, మే 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర మండల నర్సింహులపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయంలో పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. సర్పంచ్ రాచమళ్ళ రవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆర్ఐ రజనీకాంత్ రెడ్డి, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, ఎంఈఓ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, పంచాయతీ సెక్రటరీ, అంబేద్కర్ సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు రాజ్యాంగంలోని ఆర్టికల్ 17 ప్రకారం అంటరాని తనం పూర్తిగా నిషేధించబడిందని, సమాజంలో ప్రతి పౌరుడు సమానమని, వివక్ష చూపడం చట్టరీత్యా నేరమని తెలిపారు. హోటళ్లలో రెండు గ్లాసుల విధానం, దేవాలయ ప్రవేశంలో వివక్ష వంటి చర్యలు శిక్షార్హమని అవగాహన కల్పించారు. సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వంతో జీవించడం పౌరులందరి బాధ్యత అని కార్యక్రమంలో స్పష్టం చేశారు.

## వరి కొయ్యకాలు కాల్చడం వల్ల కలిగే నష్టాలను రైతులకు వివరించిన ఏఈఓ శ్రీలత




**హుస్నాబాద్, మే 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అక్కన్నపేట మండలం రామవరం క్లస్టర్ పరిధిలోని హాతిరం తండా గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించిన వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీలత, వరి కొయ్యకాలు కాల్చడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఆమె మాట్లాడుతూ, పొలాల్లో మిగిలిపోయే కొయ్యకాలను కాల్చడం వల్ల భూసారం దెబ్బతింటుందని, వానపాములు, బ్యాక్టీరియా, శిలీంధ్రాలు వంటి ఉపయోగకరమైన సూక్ష్మజీవులు నశిస్తాయని తెలిపారు. దీంతో నేలలో సేంద్రియ పదార్థం తగ్గి పంట దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అదేవిధంగా పంట అవశేషాలను కాల్చడం వల్ల కార్బన్ డైఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, మీథేన్ వంటి హానికర వాయువులు వాతావరణంలోకి విడుదలై పర్యావరణ కాలుష్యానికి దారితీస్తాయని, ప్రజల్లో శ్వాసకోశ వ్యాధులు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. పంట అవశేషాలను రోటవేటర్ సహాయంతో భూమిలో కలియదున్నాలని, వేస్ట్ డికంపోజర్ లేదా సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ వినియోగించాలని రైతులకు సూచించారు. పర్యావరణ పరిరక్షణ చట్టం, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెం.27 ప్రకారం పంట అవశేషాలను బహిరంగంగా కాల్చడం నిషేధమని, ఉల్లంఘన చేస్తే రూ.5 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి--సోమ, ఉప సర్పంచ్ వినోద్, శ్రీరామ్ తండా సర్పంచ్ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి సంపత్, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు. రైతులు పర్యావరణాన్ని కాపాడుతూ పంట అవశేషాలను సక్రమంగా నిర్వహించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# మినీ జీపీఎల్‌లో విజేతగా విక్రమ్ వైల్డ్ ఫైర్స్



**గంగాధర, మే 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గొంటి బాలయ్య స్మారకార్థంగా గంగాధర మండల కేంద్రంలో నిర్వహించిన మినీ జీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఎనిమిది జట్లు పోటీపడ్డాయి. పది రోజులపాటు జరిగిన ఈ పోటీల్లో ఫైనల్ మ్యాచ్‌లో విక్రమ్ వైల్డ్ ఫైర్స్ విజేతగా నిలిచి రూ.10,000 నగదు బహుమతి, ట్రోఫీ అందుకుంది. రెండో స్థానంలో ఠాగూర్ కింగ్స్ రూ.5,000 నగదు బహుమతి, ట్రోఫీ పొందగా, మూడో స్థానంలో ఏకేఎం, నాలుగో స్థానంలో సతీష్ టైటాన్స్ ట్రోఫీలు కైవసం చేసుకున్నాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న పడాల రాజన్న, భాగ్యలక్ష్మి క్రీడాకారులను అభినందించారు. గంగాధర క్రికెట్ అసోసియేషన్ సభ్యులు కష్టపడి టోర్నమెంట్ విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దూలం సందీప్, సుంకె దీక్షిత్, మల్యాల వినయ్ సాగర్, గౌతమ్ బూర్గుపల్లి, యువ నాయకుడు ఠాగూర్, వార్డు సభ్యులు గొంటి సంజీవ్, వేణు, తిరుపతి, అనిల్, విజయ్, శ్రీను, శ్రీహరి, డీజే సురేష్, వివేక్, నరేష్, దీపక్, విక్రమ్, బాహుపేట జొన్నల మహేందర్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదగాలని క్రీడాకారులకు ఆకాంక్షలు వ్యక్తం చేశారు.

# సింగిల్ టెండర్లను రద్దు చేయాలని ఏఐఎఫ్‌బీ డిమాండ్



**కరీంనగర్, మే 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** నగరపాలక సంస్థలో యుఐడీఎఫ్ నిధులతో చేపట్టే రూ.50 కోట్ల అభివృద్ధి పనులకు కాంట్రాక్టర్లు వేసిన సింగిల్ టెండర్లను తక్షణమే రద్దు చేయాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ డిమాండ్ చేశారు. నగరపాలక కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన ఆయన మాట్లాడుతూ, 87 పనులకు టెండర్లు పిలిస్తే అందులో 69 పనులకు ఒకే బిడ్ రావడం కాంట్రాక్టర్ల సిండికేట్ వ్యవస్థ కారణమని, అధికారుల హస్తం ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. పోటీ లేకపోవడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందని, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా కమిషనర్ శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ జోక్యం చేసుకొని సింగిల్ టెండర్ వ్యవస్థను రద్దు చేయాలని, భవిష్యత్తులో వచ్చే రూ.850 కోట్ల కేంద్ర నిధుల్లో కూడా ఇలాంటి అక్రమాలు జరగకుండా నిరోధించాలని విజ్ఞప్తి చేశారు. టెండర్ ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బోట్ల శ్యామల, తంగెళ్ల కిరణ్ కుమార్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కెమెరా బద్రినేత తదితరులు పాల్గొన్నారు. ప్రజాధనం రక్షణ కోసం సింగిల్ టెండర్లను రద్దు చేయాలని ఏఐఎఫ్‌బీ నేతలు స్పష్టం చేశారు.

# ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ సమక్షంలో కేజీబీవీ విద్యార్థినులకు ఘన సన్మానం



**పెద్దపల్లి, మే 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** సుల్తానాబాద్ మండలంలోని భూపతిపూర్ కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)లో 2025--26 విద్యా సంవత్సరానికి పదవ తరగతి విద్యార్థినులు వంద శాతం ఉత్తీర్ణత సాధించడంతో ఘన సన్మాన కార్యక్రమం జరిగింది. తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ, ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ (ఐసీఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 42 మంది విద్యార్థినులకు మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు. విద్యార్థుల భవిష్యత్ లక్ష్యాలు, మానసిక ధైర్యం, వ్యక్తిత్వ వికాసంపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి వూట్కూరి, ఐసీఐ రీజియన్-9 ప్రెసిడెంట్ ఇజ్జగిరి శ్రీనివాస్, డాక్టర్ చందా శ్రీనివాస్ రావు, మేరుగు నరేష్, రేపాక లింగమూర్తి, ప్రిన్సిపాల్ మోతె స్వప్న, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా సమాజ అభివృద్ధికి తోడ్పడటమే తమ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

## సెంట్రల్ బోర్డ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ మెంబర్‌గా కొమ్మెర రవీందర్ రెడ్డి నియామకం



**కరీంనగర్, మే 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** బీజేపీ సీనియర్ నాయకుడు కొమ్మెర రవీందర్ రెడ్డి సెంట్రల్ బోర్డ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) అడ్వైజరీ మెంబర్‌గా నియమితులయ్యారు. తిమ్మాపూర్‌లో జరిగిన బీజేపీ జిల్లా శిక్షణ తరగతుల్లో రాష్ట్ర అధ్యక్షుడు ఎం. రామచంద్రరావు చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, గతంలో కార్పొరేటర్‌గా, నార్త్ జోన్ జనరల్ సెక్రటరీగా, టౌన్ ఈసీ మెంబర్‌గా, కో-కన్వీనర్‌గా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేశానని గుర్తుచేశారు. తన సేవలను గుర్తించి పదవికి ఎంపిక చేసినందుకు కేంద్ర మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ అధ్యక్షులు బాస సత్యనారాయణ రావు, మాజీ మేయర్ సునీల్ రావు, మేయర్ కోలగాని శ్రీనివాస్, నార్త్ జోన్ అధ్యక్షుడు పాదం శివరాజు తదితరులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు. కొమ్మెర రవీందర్ రెడ్డి నియామకంతో కరీంనగర్ బీజేపీ శ్రేణుల్లో ఆనందం నెలకొంది.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అమ్మ మాట

-- అంగన్వాడీ బాట కార్యక్రమం



**తిమ్మాపూర్, మే 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రేణికుంట అంగన్వాడీ కేంద్రంలో అమ్మ మాట -- అంగన్వాడీ బాట కార్యక్రమం జరిగింది. సర్పంచ్ ఎలుక అంజనేయులు మాట్లాడుతూ పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపి ఆటపాటలతో విద్య నేర్పించడంతో పాటు గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి పిల్లలకు యూనిఫాంలు పంపిణీ చేశారు. 5o ప్రైమరీకి వెళ్లే విద్యార్థులకు విద్యారంభం, ఈసీసీఈ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కనపర్తి చంద్రశేఖర్, తమ్మనవేణి శ్రీనివాస్ యాదవ్, సీడీపీఓ, గ్రామ పెద్దలు గోనెల సంపత్, తిర్మలయ్య, టీచర్లు స్వరూప, రజిత, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు. అంగన్వాడీ ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# ఘనంగా మంత్రి శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు

**కరీంనగర్, మే 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు కరీంనగర్ నగరంలో అత్యంత ఘనంగా జరిగాయి. 55వ డివిజన్‌లో డీసీసీ సెక్రటరీ జెల్లోజి శ్రీనివాస్ పటేల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆకుల నరసయ్య హాజరై గౌరీశంకర్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శివాలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీ సమక్షంలో కేక్ కట్ చేసి ప్రజలకు మిఠాయిలు పంచారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అయిన శ్రీధర్ బాబు జన్మదినాన్ని నగరంలోని దాదాపు 80 ప్రాంతాల్లో కార్యకర్తలు ఘనంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఐదు సార్లు ఎమ్మెల్యేగా, మూడు సార్లు మంత్రిగా సేవలందిస్తూ రాష్ట్రానికి కోట్ల రూపాయల పెట్టుబడులు తెచ్చారని, తన తండ్రి శ్రీపాదరావు బాటలో నడుస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ మాట్లాడుతూ, రాష్ట్ర ఏర్పాటుకు ముందు మంత్రిగా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ప్రత్యేక స్థానం సంపాదించారని, భవిష్యత్తులో కూడా ప్రజాసేవ







కొనసాగించాలని ఆకాంక్షించారు. నగరంలోని ఎస్ఆర్ఆర్ కాలేజీ గ్రౌండ్, అంబేద్కర్ స్టేడియం, పాలిటెక్నిక్ వెటర్నరీ కాలేజీ గ్రౌండ్, కోతి రాంపూర్ గిద్దెపెరుమాళ్ల దేవాలయం, కోర్ట్ సర్కిల్, గాంధీ రోడ్డులోని వికలాంగుల ఆశ్రమం, బస్టాండ్, కరీముల్లాషా దర్గా, కమన్, కశ్మీర్ గడ్డ రైతు బజార్ తదితర ప్రాంతాల్లో కేక్ కటింగ్, అన్నదానం, పండ్ల పంపిణీ, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆకారపు భాస్కర్ రెడ్డి, కర్ర రాజశేఖర్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, వంగల విద్యాసాగర్, నాగుల సతీష్, చర్ల పద్మ, కొట్టే ప్రభాకర్, మామిడి సత్యనారాయణ రెడ్డి, నిహాల్, దిండిగాల మధు, వేల్పుల వెంకటేష్, గోపు మల్లారెడ్డి, కంరుద్దీన్, బషీరుద్దీన్, గంగుల దిలీప్, అమీర్, అబ్దుల్ బారి, ఫజల్, మాదాసు శ్రీనివాస్, బొబ్బిలి విక్టర్, కుంభాల రాజకుమార్, జొన్నల రమేష్, షబానా, వరదాల లింగమూర్తి, మూల కృష్ణారెడ్డి, హస్తపురం రమేష్, రెడ్డి శ్రీనివాస్, తిరుమల, జమీల్ ఖాన్, శిల్ప, తోట అంజయ్య, మాలోతు మహాలక్ష్మి, నూనె గోపాల్ రెడ్డి, స్వప్న, హైమద్, అజ్మత్, కూన దామోదర్, పోరండ్ల రమేష్, లాయక్, గడప శ్రీనివాస్, జి.ఎస్. ఆనంద్, అందశంకర్, జ్యోతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గం అంతటా పార్టీ శ్రేణులు, అభిమానులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# మున్సిపాలిటీల్లో సింగిల్ టెండర్లను రద్దు చేయాలని సిపిఐ డిమాండ్




**కరీంనగర్, మే 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మున్సిపల్ కార్పొరేషన్‌లో యుఐడిఎఫ్ నిధులతో చేపట్టిన పనులకు సింగిల్ టెండర్లు మాత్రమే దాఖలవడం అవినీతి, అక్రమాలకు దారితీస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ అన్నారు. బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 87 పనులకు టెండర్లు పిలిస్తే 69 పనులకు ఒక్క బిడ్ మాత్రమే రావడం అనుమానాస్పదమని, పోటీ లేకపోవడం వల్ల ప్రభుత్వానికి నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా అధికారులు సమగ్ర విచారణ జరిపి పారదర్శకతను నిర్ధారించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్‌లో దాఖలైన సింగిల్ టెండర్లను వెంటనే రద్దు చేయాలని, లేని పక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, టేకు మల్ల సమ్మయ్య, న్యాలపట్ల రాజు, పైడిపల్లి రాజు పాల్గొన్నారు. ప్రజా ధనం రక్షణ కోసం సింగిల్ టెండర్లను రద్దు చేయాలని సిపిఐ నేతలు స్పష్టం చేశారు.

# చిన్నారుల్లో టీబీ నివారణపై అవగాహన సదస్సు




**కరీంనగర్, మే 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యాలయంలో టీబీ అలర్ట్ ఇండియా, స్టేట్ టీబీ సెల్ తెలంగాణ, సాథీ సంస్థల ఆధ్వర్యంలో చిన్నారుల్లో క్షయవ్యాధి (టీబీ) కేసులను ముందస్తుగా గుర్తించి నివారించడంపై క్యాచ్-అప్ శిక్షణ కార్యక్రమం జరిగింది. జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ, చిన్నపిల్లల్లో టీబీ లక్షణాలను తొలిదశలోనే గుర్తించడం ద్వారా వ్యాధి తీవ్రతను తగ్గించవచ్చని తెలిపారు. వైద్యాధికారులు అనుమానిత కేసులను పరిశీలించి, అవసరమైన పరీక్షలు నిర్వహించి, సమయానుకూలంగా చికిత్స అందించాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న జాతీయ క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమం లక్ష్యాలను సాధించడంలో ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, ముఖ్యంగా చిన్నారుల్లో కేసుల గుర్తింపు, సంపర్కుల పరిశీలన, చికిత్స పర్యవేక్షణపై దృష్టి పెట్టాలని ఆయన పేర్కొన్నారు. శిక్షణలో నిపుణులు టీబీ నిర్ధారణ, చికిత్సా విధానాలు, యాక్టివ్ కేస్ ఫైండింగ్, డేటా నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవీందర్ రెడ్డి, డాక్టర్ సుధ, జిల్లా ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సూపర్‌వైజరీ సిబ్బంది పాల్గొన్నారు. చిన్నారుల్లో టీబీ నివారణకు ముందస్తు చర్యలు కీలకమని వైద్యాధికారులు స్పష్టం చేశారు.

## శ్రీ తిరుమల థియేటర్‌లో అర్ధరాత్రి సమయంలో భారీ అగ్నిప్రమాదం

**కరీంనగర్, మే 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



అంబేద్కర్ స్టేడియం ఎదురుగా ఉన్న శ్రీ తిరుమల థియేటర్‌లో అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో సుమారు రూ.15 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు నిర్వాహకుడు మల్లేశం తెలిపారు. ప్రమాదంలో 200 సీట్లు, ఫాల్ సీలింగ్, స్క్రీన్, సౌండ్ సిస్టమ్, ప్రొజెక్టర్ రూమ్ పూర్తిగా కాలిపోయాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## గీత కార్మికుల సమస్యలపై చర్చ

**వెల్దండ, మే 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



వెల్దండ మండల కేంద్రంలో గీత కార్మికుల పారిశ్రామిక సహకార సంఘం నాయకులు ఎక్సైజ్ సూపరిండెంట్ గాయత్రీ దేవిని, సీఐ, ఎస్సైలను కలిసి గీత కార్మికుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం అధ్యక్షుడు మట్ట వెంకటయ్య గౌడ్, సహకార సంఘం అధ్యక్షుడు మట్ట మదన్ కుమార్ గౌడ్, ఉపాధ్యక్షుడు విష్ణు గౌడ్, కార్యదర్శి కృష్ణయ్య గౌడ్, డైరెక్టర్లు మట్ట శంకరయ్య గౌడ్, మట్ట నిరంజన్ గౌడ్ పాల్గొన్నారు. గీత కార్మికుల సమస్యలు, ఈతవనం పెంపకం, అర్హులైన కార్మికులకు పెన్షన్ల మంజూరు వంటి అంశాలపై అధికారులు సానుకూలంగా స్పందించినట్లు సంఘం నాయకులు తెలిపారు. గీత కార్మికుల సంక్షేమానికి సహకారం అందిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

# ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచాలి- పిడిశెట్టి రాజు

**సిద్దిపేట, మే 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



ప్రభుత్వ పాఠశాలలో యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, క్రీడా మైదానం, ఉద్యోగ పరీక్షల్లో బెనిఫిట్ మార్కులు వంటి సదుపాయాలు ఉన్నప్పటికీ తల్లిదండ్రులు ప్రైవేట్ స్కూళ్లను ఆశ్రయించడం ఆందోళనకరమని సామాజిక కార్యకర్త, కంటెస్టెడ్ ఎమ్మెల్సీ పిడిశెట్టి రాజు అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులే తమ పిల్లలను ప్రైవేట్ స్కూళ్లలో చేర్పించడం ప్రజల్లో అనుమానాలు కలిగిస్తోందని, ఈ అనుమానాలను నివారించే బాధ్యత అధికారులదేనని ఆయన పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తేనే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని, అప్పుడే ప్రభుత్వ పాఠశాలలు నిలదొక్కుకుంటాయని రాజు అన్నారు. ప్రభుత్వ పాఠశాలల మనుగడ కోసం ప్రజాప్రతినిధులు ఆదర్శంగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పొన్నాల శంకర్, ఎస్. రమేష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెంచడం అత్యవసరమని పిడిశెట్టి రాజు స్పష్టం చేశారు.

## విద్యార్థుల భవిష్యత్తు పట్ల ప్రభుత్వం బాధ్యత వహించాలని బీఎస్పీ డిమాండ్




**హుస్నాబాద్, మే 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సీబీఎస్ఈ ఇంటర్మీడియట్ పరీక్షల్లో పేపర్లు తారుమారై విద్యార్థుల ఫలితాల్లో గందరగోళం నెలకొనడం మోదీ ప్రభుత్వ వైఫల్యమని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ విమర్శించారు. ఇటీవల నీట్ పరీక్షలో జరిగిన లోపాల తర్వాత మళ్లీ సీబీఎస్ఈ పరీక్షల్లో తప్పిదాలు చోటుచేసుకోవడం వల్ల లక్షలాది విద్యార్థుల భవిష్యత్తు అయోమయానికి గురైందని ఆయన అన్నారు. రివాల్యుయేషన్ కోసం నాలుగు లక్షల మంది విద్యార్థులు ఫీజులు చెల్లించాల్సి రావడం, ఢిల్లీకి చెందిన విద్యార్థి వేదాంత్ జవాబు పత్రం తారుమారైందని సోషల్ మీడియాలో వెల్లడించడం, ఆపై ట్రోలింగ్‌కు గురవడం తీవ్ర ఆందోళన కలిగించిందని పేర్కొన్నారు. పరీక్ష నిర్వహణలో జరిగిన తప్పిదాలకు అధికారులు బాధ్యత వహించకపోవడం, విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయకపోవడం విద్యార్థులపై నిర్లక్ష్యాన్ని చూపుతున్నదని ఆయన విమర్శించారు. విద్యార్థులకు అండగా ఉంటామని బీఎస్పీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుపుల రాజు, ఎలగందుల శంకర్, దేగల వెంకటేష్, దుంద్ర రాంబాబు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు పట్ల ప్రభుత్వం బాధ్యత వహించాలని బీఎస్పీ డిమాండ్ చేసింది.

# కోతి రాంపూర్ సెక్టర్‌లో అమ్మ మాట -- అంగన్వాడీ బాట కార్యక్రమం

**కరీంనగర్, మే 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కోతి రాంపూర్ సెక్టర్‌లో అమ్మ మాట -- అంగన్వాడీ బాట కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీడబ్ల్యూఓ సరస్వతి మాట్లాడుతూ, కొత్త విద్యాసంవత్సరానికి పిల్లల నమోదు, యూనిఫాంల పంపిణీ, విద్యారంభ సర్టిఫికెట్ల అందజేత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఐదు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలకు ఈ సర్టిఫికెట్లు స్కూల్ రెడీనెస్‌కు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. 43వ డివిజన్ కార్పొరేటర్ పొన్నం లక్ష్మి మొండయ్య మాట్లాడుతూ, అంగన్వాడీ పిల్లలు చురుకుగా ఉన్నారని, కేంద్రాలకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపితే కుటుంబం, సమాజం ఆరోగ్యంగా ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో సీడీపీఓ సబిత, ఐసీడీఎస్ సూపర్వైజర్ అరుణ, డీపీఏ రోమిలా సతీష్, అంగన్వాడీ టీచర్లు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పిల్లల విద్య, ఆరోగ్య పరిరక్షణకు అంగన్వాడీ కేంద్రాలు కీలకమని అధికారులు స్పష్టం చేశారు.

# వేసవి సెలవులు పొడిగించాలని ఓయూ అసోసియేషన్ వినతి

**హైదరాబాద్, మే 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



ఉస్మానియా విశ్వవిద్యాలయానికి చెందిన తెలంగాణ గవర్నమెంట్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ ఓయూ సెక్రటరీ డాక్టర్ చింతల రాకేష్ భవాని వేసవి సెలవులను జూన్ 10 వరకు పొడిగించాలని కోరారు. జనగణన విధులు కొనసాగుతుండడం, ప్రజాపాలన కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు పాల్గొనడం, తీవ్ర ఎండల కారణంగా సెలవులు పొడిగించడం అవసరమని ఆయన రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్ రెడ్డి, వీసీ ఓఎస్‌డీ ప్రొఫెసర్ జితేందర్ కుమార్ నాయక్‌లకు వినతిపత్రం అందజేశారు. వారు ఈ విషయంపై సానుకూలంగా స్పందించారని, అసోసియేషన్‌కు సంబంధించిన ఇతర అంశాలపై కూడా చర్చించి హామీ ఇచ్చారని డాక్టర్ రాకేష్ భవాని తెలిపారు. కార్యక్రమంలో ఈసీ మెంబర్ డాక్టర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. తీవ్ర ఎండల దృష్ట్యా వేసవి సెలవులు పొడిగించాలని అసోసియేషన్ డిమాండ్ చేసింది.

# పొగాకు రహిత సమాజానికి యువత కృషి చేయాలి - ఏ. కిరణ్ కుమార్




**కరీంనగర్, మే 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో బీసీ స్టడీ సర్కిల్‌లో న్యాయ అవగాహన సదస్సు జరిగింది. జిల్లా న్యాయ సేవా సంస్థ సభ్యులు ఏ. కిరణ్ కుమార్, పెరుక రంగయ్య పటేల్, చిట్టి చంద్రప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ పొగాకు వినియోగం వల్ల క్యాన్సర్, గుండె జబ్బులు, ఊపిరితిత్తుల వ్యాధులు వంటి తీవ్రమైన సమస్యలు తలెత్తుతున్నాయని హెచ్చరించారు. ధూమపానం చేసే వారితో పాటు వారి చుట్టుపక్కల ఉన్నవారు కూడా ప్యాసివ్ స్మోకింగ్ వల్ల ప్రమాదానికి గురవుతున్నారని తెలిపారు. కోట్పా చట్టం 2003 ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయడం, విద్యాసంస్థల సమీపంలో పొగాకు ఉత్పత్తుల విక్రయం నేరమని వివరించారు. యువత తమ ఆరోగ్యం, కుటుంబ భవిష్యత్తు దృష్టిలో ఉంచుకుని వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డా. యం. రవికుమార్, రిసోర్స్ పర్సన్లు ఏ. సంతోష్ కుమార్, గజ్జెల అశోక్ పాల్గొన్నారు. అనంతరం యువత పొగాకు రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. పొగాకు వ్యతిరేక పోరాటంలో యువత ముందుండాలని న్యాయ సేవా సంస్థ సభ్యులు పిలుపునిచ్చారు.

## కమిషనరేట్‌లో శాంతిభద్రతల పరిరక్షణపై సీపీ గౌష్ ఆలం ఆదేశాలు



**కరీంనగర్, మే 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణే ప్రధాన లక్ష్యమని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం స్పష్టం చేశారు. శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇతర రాష్ట్రాల కార్మికుల వివరాలను తప్పనిసరిగా పోలీస్ స్టేషన్లలో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం దాదాపు వెయ్యి మంది నేపాలీలు పనిచేస్తుండగా, కేవలం 169 మంది వివరాలు మాత్రమే నమోదయ్యాయని తెలిపారు. యజమానులు తమ వద్ద పనిచేసే వలస కార్మికుల వివరాలను పోలీసులకు అందించాలని సూచించారు. సీసీటీఎన్ఎస్ పోర్టల్‌లో కేసుల వివరాలను ఆలస్యం లేకుండా అప్‌లోడ్ చేయాలని, ఇందులో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల కదలికలపై 24 గంటలూ నిఘా ఉంచాలని, సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మాల్ఖానాల్లో స్వాధీనపరచుకున్న వస్తువుల నిర్వహణ పారదర్శకంగా, క్రమబద్ధంగా ఉండాలని, ప్రతి వస్తువు రికార్డుల్లో స్పష్టంగా నమోదు కావాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏసీపీ సిసిఆర్బీ శ్రీనివాస్, ఇన్స్పెక్టర్ సరిలాల్, కమ్యూనికేషన్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణలో ఎలాంటి అలసత్వం సహించబోమని సీపీ గౌష్ ఆలం హెచ్చరించారు.

# మధురానగర్‌లో ఎమ్మెల్యే వంశీకృష్ణ పర్యటన



**అచ్చంపేట, మే 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా మధురానగర్ కాలనీలో వర్షపు నీరు నిల్వ ఉండటంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ ప్రత్యక్షంగా పరిశీలించారు. కాలనీ వాసులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్న ఆయన, నీటి నిల్వ వల్ల ఏర్పడుతున్న అసౌకర్యాలు, డ్రైనేజీ సమస్యలపై అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, నీటి నిల్వ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి మల్లేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ రామనాథం, తాలూకా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతల రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు. ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

## ధాన్యం కొనుగోలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు



**కరీంనగర్, మే 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ధాన్యం కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు తీవ్రంగా విమర్శించారు. జిల్లా బీజేపీ శ్రేణుల శిక్షణ తరగతుల ప్రారంభోత్సవానికి హాజరైన అనంతరం ఆయన మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలుకు అవసరమైన ఖర్చులన్నీ కేంద్రం భరిస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం రైతుల వద్ద వడ్లను సరిగా కొనుగోలు చేయలేకపోతోందని మండిపడ్డారు. రైతు గోస -- బీజేపీ భరోసా యాత్ర ద్వారా రైతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో అకాల వర్షాల వల్ల రైతులు తీవ్ర నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రులు గందరగోళ లెక్కలు చెబుతున్నారని విమర్శించిన ఆయన, రైతుల వద్ద ఉన్న ప్రతి గింజను యుద్ధప్రాతిపదికన కొనుగోలు చేసి అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎరువుల కొరతపై మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలను తప్పుపట్టిన ఆయన, కొనుగోళ్లలో వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. కేంద్రం యూరియా కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మేయర్ కొలిపాక సునీల్ రావు, మాజీ ఎమ్మెల్యేలు గుజ్జుల రామకృష్ణారెడ్డి, బోడిగే శోభ, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మాడ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీజేపీ నేతలు తీవ్రంగా విమర్శించారు.

## తెలంగాణ హక్కుల పరిరక్షణ కోసం పోరాటం కొనసాగిస్తాం

- కల్వకుంట్ల కవిత

**రంగారెడ్డి జిల్లా, మే 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



: తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత రంగారెడ్డి జిల్లాలో విస్తృత పర్యటన చేపట్టారు. శనివారం ఉదయం చిలుకూరు బాలాజీ ఆలయాన్ని దర్శించి, శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజల శ్రేయస్సు కోసం ప్రార్థించారు. అనంతరం మొయినాబాద్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ, 111 జీవో కారణంగా చేవెళ్ల, మొయినాబాద్ ప్రాంత రైతులు నష్టపోతున్నారని, అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ జీవోను ఎత్తివేస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుత పాలకుడిని గుంపు మేస్త్రీగా అభివర్ణిస్తూ, రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని కూడా ఊడగొట్టారని విమర్శించారు. ప్రజలు పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆడబిడ్డల రక్షణ, యువతకు ఉపాధి కల్పన, గ్యారంటీ లేకుండా రూ. 2 లక్షల నుండి రూ. 20 కోట్ల వరకు రుణాలు అందజేయడం తమ పార్టీ లక్ష్యమని తెలిపారు. తెలంగాణ రక్షణ సేనలో మైనార్టీలు పెద్ద ఎత్తున చేరుతున్నారని, గంగా-జమునా తెహజీబ్ సంస్కృతిని కాపాడాలని ప్రజలను కోరారు. ఈ పర్యటనలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. తెలంగాణ హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ రక్షణ సేన పోరాటం కొనసాగిస్తుందని కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు.

## స్కూల్ బస్సులకు ఫిట్నెస్ తప్పనిసరి

- మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ పి. ఉమా




**ఉప్పల్, మే 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

విద్యార్థుల రహదారి భద్రత దృష్ట్యా ప్రతి స్కూల్ బస్సుకు ఫిట్నెస్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ పి. ఉమా తెలిపారు. ప్రతి స్కూల్ వాహనం రవాణా నిబంధనలు పాటిస్తూ సక్రమ స్థితిలో ఉండాలని సూచించారు. బస్సుల్లో ఫిట్నెస్, ఎమర్జెన్సీ డోర్లు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ వంటి భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. ఫిట్నెస్ లేని వాహనాలను రోడ్లపై నడపడం చట్ట విరుద్ధమని హెచ్చరించారు. విద్యార్థుల భద్రత కోసం స్కూల్ బస్సులపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

# బీసీ పొలిటికల్ జేఏసీ సమక్షంలో కమిటీలు ఏర్పాటు

**నాగర్‌కర్నూల్, మే 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎండబెట్ల, తాడూరు మండలాల్లో బీసీ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షుడు దన్నోజు అరవింద్ చారి, మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీవిద్య గౌడ్, సీతారాల ఆధ్వర్యంలో శనివారం ఈ ఎన్నికలు జరిగాయి. నాగర్‌కర్నూల్ టౌన్ కమిటీలో గొడుగు రాజు అధ్యక్షుడిగా, సి. దశరథం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, గొడుగు శివమ్మ మహిళా కార్యదర్శిగా, మహేష్ యూత్ ప్రెసిడెంట్‌గా, ఆంజనేయులు, రాములు ఉపాధ్యక్షులుగా ఎన్నుకోబడ్డారు. తాడూరు మండల కమిటీలో యార రమేష్ చిన్న అధ్యక్షుడిగా, భరత్ కుమార్ ఉపాధ్యక్షుడిగా, తిరుపతయ్య, బుచ్చయ్య సలహాదారులుగా, శివ సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా, అనిత మహిళా అధ్యక్షురాలిగా, వై. మల్లేష్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, జి. కురుమయ్య యూత్ ప్రెసిడెంట్‌గా, ఎం. హర్షిత మహిళా జనరల్ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అరవింద్ చారి మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చిన 78 సంవత్సరాలు గడిచినా బీసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో పూర్తిగా అందలేదని, రాజకీయ శక్తి లేకపోవడం వల్లే వెనుకబాటుతనంలో మిగిలిపోయామని అన్నారు. గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు విస్తృత కమిటీలు ఏర్పాటు చేసి బీసీలు ఏకతాటిపైకి వచ్చి పోరాడాలని పిలుపునిచ్చారు. బీసీల హక్కుల సాధన కోసం రాజకీయ చైతన్యం అవసరమని జేఏసీ నేతలు స్పష్టం చేశారు.

# అభివృద్ధి పనులపై కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సమీక్ష

**వంగూర్, మే 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**




నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ వంగూర్ మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం సమీక్షించారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రహదారి పనులు, డ్రైనేజీ నిర్మాణాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తాగునీటి సౌకర్యాలు, విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధి పనులను జూన్ నెలాఖరులోపు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొండారెడ్డిపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. నాసిరకం పనులకు తావివ్వకుండా నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా నిర్మాణాలు జరగాలని సూచించారు. పనుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని, గడువులోపు పూర్తి కాని పనులపై సంబంధిత అధికారుల బాధ్యతను నిర్ధారిస్తామని ఆయన హెచ్చరించారు. గ్రామాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, కొండారెడ్డిపల్లిని రాష్ట్రంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు కెవిన్ రెడ్డి, అదనపు కలెక్టర్ దేవ సహాయం, ఆర్డీవో జనార్దన్ రెడ్డి, ఐసిడిఎస్ పీడీ రాజేశ్వరి, వివిధ శాఖల అధికారులు, ఇంజినీరింగ్ విభాగ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. అభివృద్ధి పనులు నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## సీఎంఆర్ఎఫ్ తో పేదలకు తోడ్పాటు

- ఉప సర్పంచ్ విజయ్ రాథోడ్



**ఆమనగల్లు, మే 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**

సీఎంఆర్ఎఫ్ పేదలకు తోడ్పాటు లభిస్తోందని ఉప సర్పంచ్ విజయ్ రాథోడ్ తెలిపారు. అమనగల్లు మండలం మేడిగడ్డ తాండ చెందిన నేనావాత్ దేవి కు మంజూరైన 52 వేల సీఎం ఆర్ఎఫ్ చెక్కును శనివారం ఆయన అందజేసి మాట్లాడారు.. సీఎం సహాయనిది పథకం పేదలకు వరం లాంటిదని పేద కుటుంబాలకు ప్రభుత్వం అండ గా ఉంటుందని చెప్పారు. ఇందుకు సహకరించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మల్లేష్ నాయక్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు విజయ్, వార్డు మెంబర్ దేవేందర్, మల్లేష్, సితి భాస్కర్, డీలర్ కృష్ణ, మాజీ ఎంపీటీసీ పరమేష్, రఘు, నరేష్, పాండు, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో సర్వ శిక్ష అభియాన్ ఏఈ

రూ.40 వేల లంచం స్వీకరిస్తూ పట్టుబాటు

**నందికొట్కూరు, మే 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**





నంద్యాల జిల్లా సర్వ శిక్ష అభియాన్ ఏఈ తెలుగు రమేష్ ఏసీబీ మెరుపు దాడిలో లంచం స్వీకరిస్తూ పట్టుబడ్డాడు. శనివారం ఏసీబీ డీఎస్పీ సోమన్న ఆధ్వర్యంలో సీఐ కృష్ణయ్యల బృందం నందికొట్కూరు మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు నేషనల్ హైవే--340 సమీపంలో దాడి చేసింది. క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్ కోసం రూ. 40 వేల లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం రావడంతో, సివిల్ కాంట్రాక్టర్ ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు. కారులో నగదు స్వీకరిస్తుండగా ఏఈని రైట్ హ్యాండ్‌గా పట్టుకోవడం జరిగింది. జూపాడుబంగ్లా, మిడుతూరు పాఠశాల భవనాల పనులకు సంబంధించిన రూ. 41.6 లక్షల బిల్లుల ప్రక్రియలో ఈ లంచం కేసు వెలుగులోకి వచ్చింది. ఏసీబీ అధికారులు మాట్లాడుతూ, "ఎవరైనా లంచం అడిగినట్లు తెలిసిన వెంటనే మాకు సమాచారం ఇవ్వాలి. ప్రజల సహకారంతోనే అవినీతి నిర్మూలన సాధ్యమవుతుంది" అని సూచించారు.

## ఘనంగా సీఐటీయూ 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**మర్రిగూడ, మే 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

మర్రిగూడ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో సీఐటీయూ 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య మాట్లాడుతూ, "సీఐటీయూ పోరాటాల స్ఫూర్తితో కార్మికుల హక్కుల కోసం ముందుకు సాగుతాం. దోపిడి, పీడనలేని కార్మిక వర్గ రాజ్యం కోసం పోరాటాలు చేస్తాం. ఈ దేశంలో కార్మిక రాజ్యం వచ్చినప్పుడే కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయి" అని పేర్కొన్నారు. అలాగే, ఆయన మాట్లాడుతూ, "నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసి, కార్మికులకు 29 కార్మిక చట్టాలను అమలు చేయాలి. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. కనీస వేతనం రూ. 26,000గా నిర్ణయించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నాం" అని అన్నారు. ఈ సందర్భంగా బిల్డింగ్ వర్కర్స్, గ్రామపంచాయతీ వర్కర్స్, మధ్యాహ్న భోజన కార్మికులు, ఆటో యూనియన్లు కలిసి జెండా ఆవిష్కరణ చేశారు. మర్రిగూడ మండల కేంద్రంలో కూడా సీఐటీయూ జెండా ఎగరవేయడం జరిగింది. కార్యక్రమంలో సీఐటీయూ రైతు సంఘం మండల నాయకులు ఏరుకొండ రాఘవేంద్ర, చేపూరి సుధాకర్, కొలుగూరి శీను, రమావత్ రాజు నాయక్, మాడుగుల శ్రీను, ఊరుపక్క వెంకటయ్య, పోతరాజు కృష్ణయ్య, ఊరుపక్క నరసింహ, శంకర్, పవన్, లింగం, అనూష తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల ఎదుగుదలలో తల్లిదండ్రుల పాత్ర కీలకం


**- కౌన్సిలర్ పాపిశెట్టి రాము**



**ఆమనగల్లు, మే 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
పిల్లల ఎదుగుదలలో తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమైనదని ప్రముఖ సంఘ సేవకులు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము అన్నారు. ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణ కేంద్రంలోని 6వ అంగన్వాడీల కేంద్రంలో పిల్లల ఎదుగుదల, అభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం అనే అంశంపై తల్లిదండ్రులతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కౌన్సిలర్లు పాపిశెట్టి రాము, అనూష శ్రీశైలం హాజరై అంగన్వాడీ విద్యార్థులకు యూనిఫాం, సర్టిఫికెట్స్ అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. చిన్నారుల విద్యాభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలు కీలకమన్నారు. రెండున్నర ఏళ్ల పిల్లలను నర్సరీలో, మూడేళ్ల వారిని ఎల్.కె.జీ నాలుగేళ్ల వారిని యూకేజీలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. అంగన్వాడీల బలోపేతానికి టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు సంధ్య, విమల, రాజ్యలక్ష్మీ, సునీత, లక్ష్మమ్మ మరియు గర్భిణీలు, బాలింతలు, తల్లులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# పనులను పారదర్శకంగా చేపట్టాలి

**- ఉపసర్పంచ్ విజయ్ రాథోడ్**



**అమనగల్లు, మే 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
అమనగల్లు మండలం మేడిగడ్డ తాండ పంచాయతీ పరిధిలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను శనివారం ఉపసర్పంచ్ విజయ్ రాథోడ్, ఎ.పీ.ఎమ్ మాధవరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ పరిధిలో చేపట్టనున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను కూలీలు సభ్యులను చేసుకోవాలని సూచించారు. ఉపాధిహామీ పనులకు కూలీలు ఎక్కువ సంఖ్యలో వచ్చేలా చూడాలని తెలిపారు. వేసవి కాలం అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఉపాధి కూలీలు తప్పనిసరిగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎండలో పనిచేసే సమయంలో తరచూ నీరు తాగడం, తలపై గుడ్డ లేదా టోపీ ధరించడం, మధ్య మధ్యలో విశ్రాంతి తీసుకోవడం, అవసరమైనప్పుడు ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవడం ద్వారా నీరసం, అలసట వంటి సమస్యలను నివారించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ రవీందర్ మరియు గ్రామస్థులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.


# అంగన్‌వాడీ పిల్లలకు యూనిఫాం పంపిణీ





**ఆమనగల్లు, మే 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకునే చిన్నారులకు క్రమశిక్షణ, పాఠశాల వాతావరణంపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని కౌన్సిలర్లు దుడ్డు ఆంజనేయులు యాదవ్, సునీత ప్రశాంత్ అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని 2,11వ వార్డుల్లో వేరు వేరుగా అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కౌన్సిలర్లు పాల్గొన్ని చిన్నారులకు యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చిన్న పిల్లలకు కన్నతల్లి తర్వాత అంగన్‌వాడీ టీచరే తల్లి వంటి వారన్నారు. వారిని ప్రేమగా చూసుకుంటూ ప్రాథమిక విద్యను అందించడంలో టీచర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. పిల్లలు ఆరోగ్యంగా ఎదగాలని, చిన్నతనం నుంచే బడికి వెళ్లడం అలవాటు చేసుకోవాలనే సదుద్దేశంతో అంగన్‌వాడీ కేంద్రాలు పని చేస్తున్నట్లు తెలిపారు. పిల్లల్లో క్రమశిక్షణ, చక్కటి నడవడిక నేర్పించే విషయంలో అంగన్‌వాడీ టీచర్లు మరింత బాధ్యతగా వ్యవహరించాలని వారు సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ అనిత, స్వరూప, ఆయా జ్యోతి మరియు గర్భిణీలు, బాలింతలు, తల్లులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఉద్యోగి పదవీ విరమణ సన్మాన సభ



**దేవరకొండ మే 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ దేవరకొండ డిపోలో సుదీర్ఘ కాలం పాటు విశిష్ట సేవలు అందించి పదవీ విరమణ పొందిన ఉద్యోగి దంపతులకు డిపో సిబ్బంది, కార్మికులు ఘనంగా వీడ్కోలు పలికారు. శనివారం డిపో ఆవరణలో పదవీ విరమణ పొందిన ఉద్యోగి వెంకటేశ్వర్లు - వెంకటమ్మ దంపతులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా సహోద్యోగులు, డిపో అధికారులు మాట్లాడుతూ,సంస్థ అభివృద్ధిలో సదరు ఉద్యోగి అందించిన సేవలు ఎనలేనివని కొనియాడారు. సుదీర్ఘ కాలం పాటు ఎలాంటి మచ్చ లేకుండా, ప్రయాణికులకు సురక్షితమైన సేవలు అందిస్తూ, తోటి సిబ్బందితో ఎంతో స్నేహపూర్వకంగా ఉంటూ ఆదర్శంగా నిలిచారని అభినందించారు. విధి నిర్వహణలో ఆయన చూపిన నిబద్ధత రాబోయే తరాల ఉద్యోగులకు మార్గదర్శకమని పేర్కొన్నారు.అనంతరం పదవీ విరమణ పొందిన ఉద్యోగి మాట్లాడుతూ.. తన సుదీర్ఘ సర్వీసులో డిపో అధికారులు, తోటి కార్మిక సోదరులు అందించిన సహకారం మరువలేనిదని, సంస్థలో పనిచేయడం ఎంతో తృప్తిని ఇచ్చిందని భావోద్వేగానికి లోనయ్యారు. ఈ కార్యక్రమంలో డి.ఎం.విజయ కుమారి అసిస్టెంట్ డిపో మేనేజర్ పడాల సైదులు మెకానికల్ ఇంజనీర్ కృష్ణయ్య , వివిధ కార్మిక సంఘాల నాయకులు, సూపర్ వైజర్లు, డిపో సిబ్బంది , కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీలకు రాగి జావ పంపిణీ

**ఎండ తీవ్రతలో కూలీలకు ఉపశమనం**



**ఎలిగేడు, మే 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండలంలోని లాలపల్లి గ్రామంలో శనివారం బీజేపీ నాయకుడు అమరగొండ గంగయ్య ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలకు రాగి జావ పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా 150 మంది కూలీలకు ఉచితంగా రాగి జావ అందజేశారు. ఎండలు దంచికొడుతున్న వేళ, కూలీలు తీవ్ర ఉష్ణోగ్రతను తట్టుకునేలా రాగి జావ అందించడం ద్వారా వారికి ఉపశమనం కలిగించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గడ్డం సతీష్ రెడ్డి, మల్లారెడ్డి, ఏలేటి రత్నాకర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ నుంచి మండల పరిషత్ స్థలాన్ని కాపాడండి



**ఆమనగల్లు, మే 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు మండల పరిషత్ స్థలాలను కాపాడాలని ప్రజాప్రతినిధులు శనివారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారికి ఇచ్చిన వినతిపత్రంలో కోరారు. ఆమనగల్లు బస్టాండ్ ఆవరణలో గతంలో పీఏసీఎస్ కార్యాలయం కొనసాగిన స్థలంలో మున్సిపాలిటీ పాలకవర్గం పశువుల సంత ఏర్పాటు చేయాలని యత్నిస్తున్నారని, మున్సిపాలిటీ స్థలంలో సంత ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్లు జోగు వీరయ్య, దూల్య నాయక్, సర్పంచులు శ్రీను నాయక్, యాదయ్య, మాజీ ఎంపిటిసి దోనాదుల కుమార్, మాజీ సర్పంచ్ చందు నాయక్, సీనియర్ నాయకులు గుత్తి బాలస్వామి, వడ్డెమోని శివ కుమార్, పూసల భాస్కర్, చలిచీమల సతీష్, జంతుక కిరణ్, విటాయిపల్లి రమేష్, గండికోట శంకర్, పరమేష్, గుజ్జరి గోపి, పంతు నాయక్, వస్పుల రంజిత్, లండం యాదయ్య, లండం యాదగిరి వస్పుల లడ్డు, లండం శివ, గోరటి భరత్ తదితరులు పాల్గొన్నారు.

# చైర్మెన్ రాంరెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన యాదిలాల్



**ఆమనగల్లు, మే 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
టీడీపీ రాష్ట్ర నాయకులు, ఆమనగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండేకార్ యాదిలాల్ తెలంగాణ గ్రామపంచాయతీ ట్రిబ్యునల్ చైర్మెన్ సూదిని రాంరెడ్డిని సన్మానించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ద్వారా గ్రామ పంచాయతీ ట్రిబ్యునల్ చైర్మెన్ గా సూదిని రాంరెడ్డి నియమింపబడిన సందర్భంగా శనివారం హైదరాబాద్ లోని తన నివాసంలో సూదిని రాంరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపినట్లు యాదిలాల్ పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయిరెడ్డి, నర్సిరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మాధవరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాజి రెడ్డి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ రికార్డు గుర్తింపుతో పాటు అంబేద్కర్ ఎక్సలెన్సీ అవార్డు అందుకున్న బి.రాజ్‌కుమార్

**ఇబ్రహీంపట్నం, మే 30 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
సామాజిక సేవా, సాంస్కృతిక కార్యక్రమాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు బి.రాజ్‌కుమార్ అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 135వ జయంతి వేడుకల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు "అంబేద్కర్ ఎక్సలెన్సీ అవార్డు--2026" ప్రదానం చేశారు. కళానిలయం సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్ అబిడ్స్‌లోని తెలంగాణ సరస్వత పరిషత్‌లో నిర్వహించిన ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమంలో ఒకే వేదికపై 135 మంది కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించిన సందర్భంగా ఏర్పాటుచేసిన విశేష కార్యక్రమానికి రాజ్‌కుమార్ అందించిన సేవలను గుర్తిస్తూ గోల్డెన్ స్టార్ వరల్డ్ రికార్డ్స్ ఫోరం సర్టిఫికేట్‌ను అందజేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర మాజీ స్పీకర్ మధుసూదనాచారి చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమం ప్రపంచ రికార్డు స్థాయిలో గుర్తింపు పొందినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా బి.రాజ్‌కుమార్





మాట్లాడుతూ... తనకు లభించిన ఈ గౌరవాలు సమాజ సేవకు మరింత ప్రేరణనిస్తాయని అన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాల సాధనకు కట్టుబడి పనిచేస్తూ సామాజిక అభివృద్ధికి తన వంతు కృషి కొనసాగిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, సామాజికవేత్తలు, సాంస్కృతిక రంగ ప్రముఖులు పాల్గొని బి.రాజ్‌కుమార్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఆయనకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేసి ఘనంగా సత్కరించారు. కాగా, రాజ్‌కుమార్ కుమారుడు, ఎన్ఎస్‌యూఐ నాయకుడు బి.వినయ్ కుమార్ కూడా అంబేద్కర్ జయంతి వేడుకల సందర్భంగా ప్రదానం చేసిన "అంబేద్కర్ ఎక్సలెన్సీ అవార్డు--2026" అందుకోవడం విశేషం. తండ్రి, కుమారుడు ఒకే కార్యక్రమంలో ప్రతిష్టాత్మక అవార్డులు అందుకోవడంతో కుటుంబ సభ్యులు, మిత్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి అవార్డులు, ప్రశంస పత్రాలు మరిన్ని అందుకోవాలని పలువురు ఆకాంక్షించారు.

# కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**ఇబ్రహీంపట్నం, మే 30 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
రాష్ట్ర ప్రభుత్వం పేదింటి అడబిడ్డల కుటుంబాల్లో వెలుగులు నింపాలనే సంకల్పంతో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తెలిపారు. మంచాల మండలానికి చెందిన 53 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి . ఈ సంద్భంగా మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేదింటి ఆడబిడ్డలకు కొండంత భరోసా ఇస్తున్నాయని అన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య లక్ష్యమని



పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతూ దేశానికే మార్గదర్శిగా మారారని కొనియాడారు. పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంచాల మండల ఎమ్మార్వో ప్రసాదరావు , ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాద్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి , మంచాల సహకార సంఘం చైర్మన్ వెదిరే హనుమంత్ రెడ్డి , బైరిక రమాకాంత్ రెడ్డి , చీమల జంగయ్య యాదవ్ , మంతని శివయాథవ్, పెర్కా మూర్తి , గుడ్డిమల్ల చంద్రయ్య, మార సురేష్ , ముచ్చర్ల వెంకటేష్ , కందకట్ల జైపాల్ రెడ్డి , యశమోని శేఖర్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వెదిరే సికిందర్ రెడ్డి, కొంకని విజయ్ , రావుల నాగరాజు, భరత్ రెడ్డి, కసరమోని రాజేష్ యాదవ్, జనార్దన్, సత్యం, ఆర్ల ప్రవీణ్, కుకూడాల నరేందర్ రెడ్డి, కొల్లోజు మహేష్ ,తదితరులు పాల్గొన్నారు.

# రాజస్థాన్‌లో ఇసుక తుపాను బీభత్సం..


**-తీవ్రంగా ఇబ్బందిపడ్డ జనం..!**



**న్యూఢిల్లీ మే 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాజస్థాన్ లో ఇసుక తుపాను బీభత్సం సృష్టించింది. రాష్ట్రంలోని చురు, శ్రీగంగానగర్, బికనీర్, సీకర్ తదితర ప్రాంతాల్లో శనివారం మధ్యాహ్నం భీకర గాలులు వణికించాయి. దట్టమైన మేఘాల రూపంలో ఇసుక ఆవరించడంతో ఒక్కసారిగా చిమ్మచీకట్లు కమ్ముకున్నాయి. అనంతరం ఆయా ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఇసుక తుపాను కారణంగా వాహనదారులు, స్థానికులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. దట్టమైన ఇసుక తుపానుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియా లో వైరల్‌గా మారాయి.అంతకుముందు.. జైపూర్‌లోనూ శుక్రవారం ఇదే విధమైన వాతావరణం కనిపించింది. ఇసుక తుపానుతోపాటు భీకర గాలులు వీచాయి. ధోల్‌పుర్ జిల్లాలో అత్యధికంగా 5.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలో ఈ తరహా వాతావరణం మరో నాలుగైదు రోజులు కొనసాగే అవకాశం ఉందని జైపూర్‌లోని వాతావరణ కేంద్రం వెల్లడించింది. జైపూర్, అజ్మీర్, బికనీర్, కోటా, జోధ్‌పూర్, ఉదయ్‌పూర్ డివిజన్లలో గంటకు 60-70 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీయడంతోపాటు ఆయా చోట్ల ఉరుములతో కూడిన వర్షంపడే అవకాశం ఉందని తెలిపింది.

# పతంజలి ఉత్పత్తులకు మహారాష్ట్ర ఎఫ్‌డీఏ షాక్..


**భారీగా మెడిసిన్స్ సీజ్..!**



**న్యూఢిల్లీ మే 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రముఖ యోగా గురు బాబా రాందేవ్ కు చెందిన పతంజలి బ్రాండ్ ఉత్పత్తులకు మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ షాకిచ్చింది. నివారణ అంటూ తప్పుదోవ పట్టించే, అభ్యంతరకరమైన ప్రకటనలు ఇస్తున్నారన్న ఆరోపణలతో ఎఫ్‌డీఏ రాష్ట్రవ్యాప్తంగా దాడులు నిర్వహించి భారీగా మందులను స్వాధీనం చేసుకుంది. సీజ్ చేసిన ఆయుర్వేద (రూ.ఎతీజవఖు), అల్లోపతి (రూశ్రీశ్రీశీజూఖ్ష్ణఎ) మందుల విలువ సుమారు రూ.73.24 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఈ మందుల్లో పతంజలి బ్రాండ్‌తో విక్రయిస్తున్న ఉత్పత్తులు కూడా ఉన్నాయి.డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ (అభ్యంతరకరమైన ప్రకటనలు) చట్టం కింద ఈ చర్యలు తీసుకున్నట్లు ఎఫ్‌డీఏ వెల్లడించింది. ముంబై, కొంకణ్, పుణె, నాసిక్, అమరావతి, నాగ్‌పుర్, ఛత్రపతి శంభాజీనగర్ డివిజన్లలో ఏకకాలంలో ఈ దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పతంజలి బ్రాండ్ కింద మార్కెటింగ్ చేస్తున్న, హరిద్వార్‌లోని దివ్య ఫార్మసీ తయారు చేసిన మందులను కూడా పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకున్నారు. ముఖ్యంగా నాగ్‌పూర్ డివిజన్‌లో రూ.7,26,755 విలువైన మందులను, నాసిక్ డివిజన్‌లో రూ.7,10,945 విలువైన స్టాక్‌ను సీజ్ చేసినట్లు అధికారులు వివరించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని ఎఫ్‌డీఏ స్పష్టంచేసింది.

# యూపీ విద్యుత్ వినియోగదారులకు షాక్..

**- పది శాతం పెరుగనున్న కరెంట్ బిల్లులు**



**న్యూఢిల్లీ మే 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం విద్యుత్ ధరలు పెంచింది. ఇంధన సర్దుబాటు ఛార్జీ విధానం కింద అదనపు సర్‌ఛార్జ్ విధించాలని ఉత్తర ప్రదేశ్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ నిర్ణయించింది. దీంతో జూన్ నెల నుంచి కరెంట్ బిల్లులు పది శాతం మేర పెరుగనున్నాయి. విద్యుత్ పంపిణీ సంస్థలకు పెరిగిన ఇంధనం, విద్యుత్ కొనుగోలు ఖర్చులను భర్తీ చేయడానికి అదనపు సర్‌ఛార్జ్ విధిస్తున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. ఇంధన సర్దుబాటు ఛార్జ్ విధానం ద్వారా ఇంధన ఖర్చులు, విద్యుత్ కొనుగోలు వ్యయాలలో వచ్చే హెచ్చుతగ్గులను వినియోగదారుల నుంచి తిరిగి రాబట్టుకోనున్నట్లు వివరించారు కాగా, ఇంధన సర్దుబాటు ఛార్జీ విధానం కింద అదనపు సర్‌ఛార్జ్ విధించనుండటంతో ఉత్తర ప్రదేశ్‌లోని విద్యుత్ వినియోగదారులు అధిక విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో జూన్ నెల నుంచి కరెంట్ బిల్లులు సుమారు పది శాతం మేర పెరుగనున్నాయి. ఈ నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులపై ఆర్థిక భారం పడనున్నది.

# గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని విజ్ఞప్తి

**మస్జిద్-ఏ-మహబూబ్ ముతవల్లి సౌదీ చాంద్ ఆవేదన**



**నందికొట్కూరు, మే 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గో సంరక్షకుల ముసుగులో జరుగుతున్న హింసకు అడ్డుకట్ట వేయాలని, గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని మస్జిద్-ఏ-మహబూబ్ కమిటీ ముతవల్లి, షేహెరే జమీయత్-ఏ-అహ్లెహదీస్ నాయబ్ అమీర్ సౌదీ చాంద్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రతి మనిషికి గోవు తల్లి లాంటిది. గోవును జాతీయ జంతువుగా ప్రకటిస్తే గో సంరక్షణ చట్టాల్లో ఏకరూపత వస్తుంది. గో సంరక్షకుల ముసుగులో జరుగుతున్న హింసకు అడ్డుకట్ట పడుతుంది" అని పేర్కొన్నారు. ప్రస్తుతం పులికి జాతీయ జంతువు హోదా ఉన్నప్పటికీ, గోమాతకు అలాంటి గుర్తింపు లేదని, ఆవుకు జాతీయ జంతువు హోదా కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా, "ఏ మత గ్రంథమూ ఆవును బలి ఇవ్వమని చెప్పదు. తోటి పౌరులకు బాధ కలిగించే చర్యలకు పాల్పడకూడదు. జాతీయ జంతువుగా ప్రకటిస్తే ఆవును కొనడం, అమ్మడం నేరమని అందరికీ అవగాహన కలుగుతుంది" అని ఆయన అన్నారు. బక్రీద్ సందర్భంగా నందికొట్కూరు పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడా గోవులను బలి ఇవ్వలేదని, ముస్లిం పెద్దలు స్వయంగా గోవులను కుర్బానీ చేయవద్దని ప్రకటించారని సౌదీ చాంద్ తెలిపారు. "హిందూ, ముస్లిం భాయీ భాయీ" అంటూ సామరస్య వాతావరణం కొనసాగాలని పిలుపునిచ్చారు. నందికొట్కూరు నియోజకవర్గ ముస్లిం సోదరులు కలిసికట్టుగా గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని కోరుతూ, స్థానిక ఎమ్మెల్యే గిత్త జయసూర్య, ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తత్తూరు హనీఫ్, అబ్దుల్ రహిమాన్, అబ్దుల్లా, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా శుద్ధీకరణలో నిర్లక్ష్యానికి తావులేదు





**-ఎస్ఐఆర్--2026పై ఎన్నికల సంఘం దిశానిర్దేశం**



**శ్రీశైలం/నంద్యాల, మే 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఓటర్ల జాబితా ఎన్నికల ప్రక్రియకు పునాదిగా నిలుస్తుందని, అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పిస్తూ అనర్హులు జాబితాలో చోటు చేసుకోకుండా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)--2026ను పారదర్శకంగా, ఖచ్చితత్వంతో నిర్వహించాలని భారత ఎన్నికల సంఘం కార్యదర్శులు సంతోష్ కుమార్ దూబే, నవీన్ కుమార్ సూచించారు. శనివారం శ్రీశైలంలో నంద్యాల, కర్నూలు, ప్రకాశం, కడప జిల్లాల ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో సమగ్ర సమీక్ష సమావేశం జరిగింది. ఎన్నికల సంఘం అండర్ సెక్రటరీ శీష్ రామ్, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పాల్గొన్నారు. సంతోష్ కుమార్ దూబే మాట్లాడుతూ, "ఓటర్ల జాబితా శుద్ధీకరణ నిరంతర ప్రక్రియ. డూప్లికేట్, మరణించిన, వలస వెళ్లిన ఓటర్ల వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలి. ఆధార్ కార్డు కేవలం గుర్తింపు పత్రం మాత్రమే, చిరునామా లేదా జనన తేదీ రుజువుగా పరిగణించరాదు" అని స్పష్టం చేశారు. బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేయాలని, తాళం వేసి ఉన్న ఇళ్లను కనీసం మూడు సార్లు సందర్శించి వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. ఫారాల స్కానింగ్, ఫోటోలు, సంతకాల సేకరణలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. నవీన్ కుమార్ మాట్లాడుతూ, "ఎస్ఐఆర్ ప్రక్రియ దేశవ్యాప్తంగా విజయవంతంగా అమలవుతోంది. ఇప్పటివరకు 60 శాతం ఓటర్ల కవరేజీ పూర్తయింది. ముందస్తుగా పనులు పూర్తి చేస్తే లోపాలను సరిదిద్దుకునేందుకు తగిన సమయం లభిస్తుంది" అని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, "ప్రతి బూత్ స్థాయి అధికారి ఇంటింటికీ వెళ్లి ఫారాలు పంపిణీ చేసి, తాజా ఫోటోలు సేకరించి డిజిటలైజ్ చేయాలి. ఒకే కుటుంబ సభ్యుల పేర్లు ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉండేలా చూడాలి. అర్హుడైన ఒక్క ఓటరు కూడా జాబితా వెలుపల మిగిలిపోకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలి" అని ఆదేశించారు. ఈ సమావేశంలో సంబంధిత జిల్లాల ఎన్నికల అధికారులు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు పాల్గొన్నారు.

# సుదీర్ఘకాలం పోలీస్ శాఖకు సేవలందించడం అభినందనీయం

**-పదవీ విరమణ పొందిన పోలీసులను ఘనంగా సన్మానించిన జిల్లా ఎస్పీ**




**నంద్యాల, మే 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సుదీర్ఘకాలం బాధ్యతాయుతంగా, క్రమశిక్షణతో పోలీస్ శాఖలో సేవలందించి పదవీ విరమణ పొందిన పోలీసు సిబ్బందిని నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ ఘనంగా సన్మానించారు. నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఎస్పీ సునీల్ షోరాణ్ పదవీ విరమణ పొందిన పోలీసులకు శాలువాలు కప్పి, పూలమాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "మీరు అంకితభావంతో, నిబద్ధతతో పోలీస్ శాఖకు అందించిన సేవలు చిరస్మరణీయాలు. పదవీ విరమణ అనంతరం కూడా మీరు పోలీస్ కుటుంబంలో భాగమే. భవిష్యత్తులో ఎలాంటి సహాయం కావాలన్నా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ మీకు తోడుగా ఉంటుంది" అని భరోసా ఇచ్చారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎన్. యుగంధర్ బాబు మాట్లాడుతూ, "మీరు నియామకం పొందినప్పటి నుండి ఆరోగ్యంగా, క్రమశిక్షణతో పోలీస్ శాఖకు సుదీర్ఘకాలం సేవలందించడం అభినందనీయం. రిటైర్మెంట్ అనంతరం కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తున్నాను" అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, జిల్లా సాయుధ బలగాల డీఎస్పీ శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్లు మల్లికార్జున గుప్తా, సూర్యమౌళి, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు బాబు, సురేష్ బాబు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

# నీలగిరి సాహితీ సంగమం -7

## పల్లెసీమలు

సీసం

పల్లెవారును జూడ ప్రకృతమ్మ యొడిలోన
పరవశించునెపుడు పండుగనుచు
తోటివారి యెడల తోబుట్టు భావన
కలిగియుండును గదా కలననైన
అత్తమామయనుచు యన్నదమ్ములనుచు
ప్రియవచనములతో పిలుచుకొనును
పల్లెసీమలనగ పట్టుకొమ్మలవోలె
పరుల సేవ కొరకె పనికివచ్చు
ఆ.వె.
ఒకరిపట్లనొకరు నోర్పుగా మసలుచు
స్వార్థబుద్ధివీడి స్పర్థలేక
కలిసిమెలిసియున్న కలిమియే మనదంటు
మార్గదర్శకంబు మహిన వారు

విజయప్రసాద్ నలుమాసు
కరీంనగర్

## అమ్మ

ఉ!!మా!!

కాకరపుల్లవోలె తను కాలుచు క్రాంతిని బంచుచుండునే
కూకటివేళ్ళతోడ తను కూలుచు పిల్లల కాచుచుండునే
ఆకలి గొన్నవేళతను యప్పటికప్పుడు బొజ్జ నింపి యా
చాకలి కన్న మిన్న గను చక్కని సేవలు గూర్చునమ్మరో!!

గడ్డం కృష్ణారెడ్డి.రేపాల సూర్యాపేట!!

## స్వప్న ప్రకరణము

ఆ.వె
కలవరింత లన్ని కలల ప్రభావమే
కన్ను విప్పకుండ కలుపు మాట
పైకి చెప్పు చుండు పలవరించుచునుండు
కలల యందు జరుగు కథన మంత

ఆ.వె
ఎంత సమయముండు నే కల యనునది
చెప్ప సులువు కాదు చెప్ప లేమె
యర్థ గంట పట్టు నంత విషయమైన
నర్థ నిమిష మందు నంత మొందు

ఆ.వె
కలలు కూడ పంచు కష్ట సుఖంబులు
కాంచి నంత వాని గలలయందు
మనసు వీక్ష చేయు మంత్ర ముగ్ధ వోలె
కలిగెడనుభ వంబు కలలయందు

సత్యనారాయణ బొలిశెట్టి,
హైదరాబాదు

## ఉత్తరకాశీ దర్శనం-వర్షపు హోరు.

కం.
ఎంతో శ్రమపడి వచ్చితి
వింతగ నీవర్షమేల విశ్వవినోదీ!
చింతాకంతయు దయతో
పంతమువిడి దరసనమిడు పరమేశ !విభూ!

కం.
పర్వత శ్రేణులు నిలయము
పర్వత కన్యయె సతిగను పరవశ మతియై
సర్వజ్ఞా!నటరాజా!
ఖర్వులనడగించు దేవ!కరుణయె లేదా!

కం.
తెల్లని దేహము నీదే
నల్లనిపెనుమబ్బుగములు నలుదెసలందున్
నల్లనివానిగ దోచును
చెల్లెను నద్వైతమనగ చిత్తమునందున్

కం.
దేహము తడిసెను ముద్దయి
మోహముమదినుండి పోదు మురహరమిత్రా!
సో2హమ్మత్త్వము జేరగ
నీహితములగూర్చుమయ్య ,ఈశ!గిరీశ!

అవధానిని గాయత్రీదేవి

తే.గీ.
గురువు మహిమన్నఁ జెప్పగ కువలయమున
సాధ్యమౌనె నేరికయి నసాధ్యమగును
గురువె సకలము జగతిని మెరుగ పరచ
గురినిఁజూపును నిరతము గూర్మితోడ

తే.గీ.
భ్రాంతి,భ్రమలను దీర్పగ భద్రుడతడు
తాడు,సర్పమను కొనుచు తల్లడిల్ల
నిజమ్మఁ దెల్పగ నండగ నిల్చువిభుడు
జ్ఞానజ్యోతిని వెలిగించు సాత్వికుండు. 2

తే.గీ.
మాధవ మహేశ బ్రహ్మల మారురూపు
చిత్తును దెలుపు నాచార్య చిన్మయుండు
జనన మరణము లెల్లను శంభులీల
జన్మ భాష్యము నెరిగించు జ్ఞాన మూర్తి

మాతా గంగాభవాని శాంకరీ దేవి,
చెన్నై.

## సూర్యోదయవేళ

సీ.
కమలాప్తు డుదయించె గగన వేదికపైన
కలువలన్నియు బోయె కలత నిదుర
కోనేటి జలముల కొలువౌచు వరుసగ
తామరలు వికసించె తరణి గనగ
పులుగులన్నియు పాడె భూపాల రాగమ్ము
వెలుగు రేఖలు పంచ వెలుగుల దొర
విరులన్ని విరబూసె వినుకెంపు నర్చింప
సవితను గొనియాడె సకల జగతి.

?తే.గీ.

గగనమున వెలుగుల నిడు కర్మ సాక్షి!
కమల మిత్రుడ! కరుణించి గావు మయ్య!
దీనులకు దిక్కు నీవయ దీన బంధు!
వేడి కొలిచెడి వారల వెతలు బాపు!

మరింగంటి శ్రీనివాస్
హైదరాబాద్

## కృష్ణ స్తుతి:

మంజరీ ద్విపద:
శిరమున ఫింఛము చిరునగు మోము,
ముత్యాల హారము, మురళి కరమున
రాజసముగ నున్న రసరమ్య థామ!
గిరిధారి! కృష్ణయ్య! కేకి ఫింఛధర!
కస్తూరి తిలకుడ కమనీయ రూప
కదలి రా కన్నయ్య! కరుణను జూప,
వినతిని వినిపింతు వినగ రావయ్య,
దేవకీ పుత్రుడ ధైర్య మొసంగ,
నందనందన కృష్ణ! నవనీత చోర!
నడుము బిగించుచు నాట్య మాడుచును,
కనకాంబరధరుడ! కరుణామయుండ!
కనుదోయి కాంతితో కదలిరా కృష్ణ!
వేణుగోపాల!శ్రీ బృందావిహారి!

వసుమతీ జగన్నాథం.
హైదరాబాదు

## బడిబాట

కంద పద్యములు:-

మాసములు రెండు గడువగ
వేసవి సెలవులు విడిచెడు వేళాయమ్మా!
ఆసల పందిరి నల్లుచు
ధ్యాసను బడిబాటవైపు దరిజేర్చెదనే.

కొత్త తరగతి చదువులు ,
కొత్తవి పొత్తములు కొత్తకొత్తవి దుస్తుల్
సత్తువ కల భోజనములు
సత్తిని కలిగించునటుల సంతసపెడుదుర్.

బర్వగు రుసుములు లేకను సర్వముచితమనుచితమును
సర్కారుబడిలోన్
గర్వపడుచు చదివెదము స
గర్వముగుత్తమ ఫలితాల్ సాధించెదమోయ్.

కశోర్ఘుల నాగేశ్వర్ శర్మ,
ధర్మపురి.

## బాలరామ

ఆటవెలది పద్యాలు

రామనామ మహిమ రమ్యమైనుండును
రామ భజన జేయ రగులు భక్తి
భక్తిలేని బ్రతుకు ముక్తి దరికి పోదు
భక్తపారిజాత బాలరామ

రామ గుణము నేర్వ రాజిల్లు జన్మము
రామబాట నడువ రాదు బాధ
రామ బాట వల్ల రామ రాజ్యమువచ్చు
భక్తపారిజాత బాలరామ

తల్లితండ్రి సేవ తనయుడు రాముడు
జేసినాడు నెపుడు చేతులార
జనని జనుకులన్న జగతిలో దేవుళ్ళు
భక్తపారిజాత బాలరామ

..జాధవ్ పుండలిక్ రావు పాటిల్

## శీర్షిక . పాదరక్షలు

భానుని తాపము నుంచి పాదాలకు రక్షణ ముళ్ల బాటలో ఆరోగ్య పరిరక్షణ
భరతుని శిరసుపై నిలిచిన రామ
పాదుకలు చేసెను రాజ్యపాలన
లక్షల్లో ఖరీదున్న పాదుకలైనాగడప బయటే నిలుచునన్నా
రంగు రంగుల పాదరక్షలు రమ్యమైన ఆకారాలు
తయారీ కొందరికి ఉపాధి కల్పిస్తున్నాయ్
అమ్మకాలు మరికొందరికి జీవనోపాధినిస్తున్నాయ్
మాటా మాటా పెరిగితే ఆయుధాలు అవుతున్నాయ్
సామాన్యులకు చెప్పు లవుతున్నాయ్
మహాత్ములకు పాదుక లవుతున్నాయ్
ఇందు కలదు అందులేదని సందేహము వలదు
ఇంట బయట, స్నానాల గదిలో పడక గదిలోనూ చెప్పు లే.
నోరు అదుపులో లేకుంటే చెప్పు దెబ్బలే.

డా జి భవానీ కృష్ణమూర్తి
హైదరాబాదు

## శీర్షిక : వింత వాతావరణం

భానుడి తాపం
మేఘపు వర్షం
ఊపిరాడని ఉక్కపోత
వణికించే కుండపోత
ఎండ తీవ్రతకు పట్టె గొడుగు
వెంటనే తయారయే జలమడుగు
పాదం నేల మొప్పలేని వేడి
కాలు పెడితే దిగబడేంత తడి
పొద్దున్న వాన ముసురు
మధ్యాహ్నం ఎండ ఉసురు
ఎండకు పట్టే చెమటలు
వానకు పుట్టే వణుకులు

పేరు : వి.అశోక్
మంథన్ గోడ్, నారాయణ పేట

## ముక్కంటి

సీసం

అర్ధనారీశుడు నరిభయంకరుడును
పార్వతీ దేవికి ప్రాణవిభుడు
తపము జేసినయంత దర్శనమునొసగు
కల్మశంబుయు లేని కాళహరుడు
ముజ్జములనునేలు ముక్కంటియై తాను
భస్మము నిడినంత పరవశించు
జలముతో నభిషేకమును జేయ జయములే గూర్చుచున్
శివశివయన్నంత సిరులనొసగు!

ఆటవెలది

శివుని నామ భజన చిత్తమందున జేయ
భాగ్యమలరుచుండు భవమునంత
భక్తి గల్గి మ్రొక్క ముక్తియే నొసగుచున్
వరములిచ్చు హరుడు వసుధజనుల!

కొంటికర్ల లలిత
సీసపద్యము.

## ప్రయాణం

................
?ఎందుకో తెలియదు కానీ..
గమ్యం కంటే ప్రయాణమే ఎంతో సుందరం!
మదిలో ఏదో తెలియని ఉత్సాహం..
మరోవైపు సన్నని అలజడి!
?ప్రయాణం కొన్ని గంటలే కావచ్చు..
కానీ ఆ కొంత కాలమే
మనలో విభిన్న ఆలోచనల బీజాలు నాటుతుంది.
కొద్ది క్షణాలు మనల్ని మనం మర్చిపోయి..
ప్రపంచాన్ని సరికొత్త కోణంలో చూసేలా చేస్తుంది.
?ప్రయాణం సాయంత్రమైతే..
కనురెప్పల ముందు కదిలే దృశ్యాలెన్నో!
అలసిన పొద్దున గూటికి చేరే పక్షులు..
విశ్రాంతి పిలుపును వినిపిస్తాయి.
?అదే ప్రయాణం ఉదయమైతే..
ఏ చోటుకెళ్లినా తిరిగి రావాల్సిందేనని..
గమ్యం తాత్కాలికమేనని గుర్తు చేస్తుంది.
?ఈ దారి మనసులో కొత్త ప్రశ్నలను రేకెత్తిస్తుంది..
వింతైన అనుభవాల కావ్యాన్ని రచిస్తుంది.
అందుకే.. గమ్యం చేరడం కంటే,
ప్రయాణించడం ఎంతో అద్భుతం!

పోడేటి సమజ్ఞ,
బి. ఏ. ద్వితీయ సంవత్సరం,
ఉమెన్స్ డిగ్రీ కాలేజ్, కరీంనగర్.

తే.గీ.
ఉండి యోంకారపరిధిలో నున్నతముగ
దండి యద్వైతతత్త్వము ధారవోసి
మండితంబైన ధర్మంబు మానవులకు
గుండియల నిండ నింపిన గురుడవీవు!!

మత్తేభము:-
శివరూపమ్మును బొంది తాను గురుడై శ్రేయమ్మునందించగన్
శివశూలమ్మదె దండమయ్యె కరమున్ శ్రీ కాలడీవాసుకున్
శివతత్త్వమ్ము ప్రచారసాధనముగా చేకొంచు బోధించుచున్
శివభక్తిన్ ప్రబలించినాడు జగతిన్ శ్రీ శంకరాచార్యుడై!!

....తిప్పారపు లక్ష్మీ నర్సయాచార్యులు
వెదిర



## రాశి ఖన్నా గ్లామరస్ పిక్స్ వైరల్,

# పులి-మేకతో రోజా రీ ఎంట్రీ




సీనియర్ నటి, ఫైర్ బ్రాండ్ రోజా సెల్వమణి ఒకప్పుడు తెలుగు, తమిళ్ ఇండస్ట్రీలలో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న రోజా.. రాజకీయాల్లోకి వచ్చాకా సినిమాలు తగ్గించారు. ఇక తాజాగా రోజా తమిళ్ సినిమాలో రీఎంట్రీ ఇచ్చారు. దాదాపు 12 ఏళ్ళ తరువాత ఆమె నటిస్తోన్న చిత్రం లెనిన్ పాండియన్. ఈ సినిమా తెలుగులో పులి మేక అనే పేరుతో రిలీజ్ కానుంది. డి.డి. బాలచంద్రన్ దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రానికి మ్యూజిక్ మ్యాస్ట్రో ఇళయరాజా సంగీతం అందించారు. ఈ చిత్రంలో గంగై అమరన్, దర్శన్ గణెళిశన్ కీలక పాత్రల్లో నటించారు. ఇప్పటికే పులి మేక చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ సినిమా తెలుగు ట్రైలర్ ని మేకర్స్ రిలీజ్ చేశారు. ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంటుంది. ఈ చిత్రం గ్రామీణ నేపథ్యం, రాజకీయాలు, మరియు పోలీసు వ్యవస్థ చుట్టూ తిరిగే ఒక పవర్‌ఫుల్ సామాజిక డ్రామాగా రూపొందింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా ఒక సామాన్య రైతు స్వేచ్ఛగా జీవించలేకపోతున్నాడనే బలమైన సంభాషణతో ఈ ట్రైలర్ మొదలయ్యింది. ఇంకోపక్క కానిస్టేబుల్ గా హీరో ఎన్ని అవమానాలు పడుతున్నాడో చూపించారు. పోలీస్ స్టేషన్లలో కానిస్టేబుళ్లపై జరిగే అణిచివేత, ఉన్నతాధికారుల అహంకారం, మరియు మట్టి మాఫియా వల్ల గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న అన్యాయాలను కళ్ళకు కట్టినట్లు చూపించారు. చట్టం, న్యాయం, మరియు అధికార దుర్వినియోగానికి వ్యతిరేకంగా జరిగే పోరాటమే ఈ సినిమా కథగా తెలుస్తోంది. ఇక ఈ చిత్రంలో రోజా ఒక వయస్సు మళ్ళిన మహిళగా కనిపించారు. మరి ఈ చిత్రంతో రోజా రీఎంట్రీ ఎలా ఉండబోతుందో చూడాలి.

# క్యూట్‌నెస్‌తో మతిపోగొడుతున్న దీపిక పిల్లి

సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు ఈ తరం యువతకు సరికొత్త అవకాశాలను తెచ్చిపెడుతున్నాయి. కేవలం తమలోని టాలెంట్‌తో డిజిటల్ దునియాను ఏలి, ఆ తర్వాత వెండితెర, బుల్లితెరలపై స్టార్‌లుగా మారిన వారు చాలా మంది ఉన్నారు. ఆ కోవలోకే వస్తుంది అందాల యాంకర్ దీపిక పిల్లి . టిక్‌టాక్ వీడియోలతో కెరీర్ ప్రారంభించి, ప్రస్తుతం టాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ యాంకర్‌లలో ఒకరిగా, నటిగా ఈ బ్యూటీ దూసుకుపోతోంది.దీపిక పిల్లి మొదట టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ ద్వారా విపరీతమైన పాపులారిటీని సంపాదించుకుంది. ముఖ్యంగా తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్, చలాకీతనం , డాన్స్ వీడియోలతో లక్షలాది మంది ఫాలోవర్లను సొంతం చేసుకుంది. సోషల్ మీడియాలో ఆమెకు ఉన్న ఈ విపరీతమైన క్రేజ్ బుల్లితెర మేకర్స్ దృష్టిని ఆకర్షించింది. దాంతో ప్రముఖ డ్యాన్స్ రియాలిటీ షో 'ఢీ'లో ఒక టీమ్ లీడర్‌గా వ్యవహరించే గోల్డెన్ ఛాన్స్ దక్కించుకుంది. ఈ షోతో దీపిక పిల్లి అనే పేరు తెలుగు రాష్ట్రాల్లోని ప్రతి ఇంట్లోనూ మార్మోగిపోయింది.కేవలం బుల్లితెర షోలకు మాత్రమే పరిమితం కాకుండా, దీపిక పిల్లి తన గ్లామరస్ ఫోటోషూట్‌లతో ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. దీపిక పిల్లి షేర్ చేసే సరికొత్త లుక్స్, స్టన్నింగ్ ఫోటోలు సోషల్ మీడియాలో క్షణాల్లో వైరల్ అవుతుంటాయి. అటు మోడరన్ వెస్ట్రన్ దుస్తులలోనైనా, ఇటు పద్ధతైన సాంప్రదాయ చీరకట్టులోనైనా ఆమె చూపించే వేరియేషన్స్ అభిమానులను ఎంతగానో కట్టిపడేస్తాయి. క్యూట్‌నెస్ , గ్లామర్ కలగలిపిన ఆమె ఫోటోలు నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటూ ఉంటాయి.యాంకర్‌గా 'కామెడీ స్టార్స్', 'ఢీ' మరియు జెమిని టీవీలోని 'మాస్ జాతర' వంటి పలు పాపులర్ షోలతో బిజీగా ఉంటూనే, సినిమా ఇండస్ట్రీలోనూ ఈ ముద్దుగుమ్మ అడుగుపెట్టింది. అల్లరి నరేష్ నటించిన 'బంగారు బుల్లోడు' చిత్రంతో వెండితెరకు పరిచయమైంది. ఆ తర్వాత ప్రదీప్ మాచిరాజు, వెన్నెల కిషోర్ ప్రధాన పాత్రల్లో వచ్చిన 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' లాంటి సినిమాల్లో నటిగా మంచి ప్రాధాన్యత ఉన్న పాత్రలను పోషించింది.చలన చిత్ర పరిశ్రమకు వచ్చిన అతి తక్కువ కాలంలోనే తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చుకున్న దీపిక పిల్లి, రాబోయే రోజుల్లో మరిన్ని పెద్ద ప్రాజెక్టులతో టాలీవుడ్‌లో మరింత స్టార్‌డమ్ సొంతం చేసుకునే దిశగా అడుగులు వేస్తోంది. అయితే కొన్నాళ్లుగా బుల్లితెరపై సైలెంట్ అయిన ఈ అమ్మడు ఇప్పుడు బ్లూ డ్రెస్‌లో క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో అదరగొడుతున్న ఫోటోస్ షేర్ చేసి ఒక్కసారిగా హాట్ టాపిక్ అయ్యింది. చూపుల్తోనే మాయ చేస్తోంది, బుల్లితెర బుట్టబొమ్మ, క్యూట్‌నెస్ ఓవర్‌లోడెడ్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్స్.




# ఈ అభిమానం ఇలాగే ఉండాలి



శ్రద్ధాకపూర్ కొత్త రికార్డును నమోదు చేసింది. మే 2026 లెక్కల ప్రకారం ఇన్‌స్టాగ్రామ్‌లో అత్యధిక ఫాలోవర్లు కలిగిన కథానాయికగా ఆమె అవతరించింది. తాజాగా బయటకొచ్చిన అత్యధిక ఫాలోవర్లు కలిగిన టాప్ హీరోయిన్ల అధికారిక ఇన్‌స్టా జాబితాలో, మిగతా స్టార్ హీరోయిన్లందరినీ వెనక్కి నెట్టి, ఏకంగా 93 మిలియన్లు అనగా, 9కోట్ల 3లక్షల ఫాలోవర్లతో టాప్‌లో నిలిచింది శ్రద్ధాకపూర్.ఈ పోటీలో శ్రద్ధాకు.. ప్రియాంక చోప్రా గట్టి పోటీనే ఇచ్చింది. 92 మిలియన్ల ఫాలోవర్లతో ఆమె రెండో స్థానంలో నిలవడం విశేషం. ఈ విజయంపై ఇన్‌స్టా ద్వారా శ్రద్ధా ఆనందాన్ని వ్యక్తం చేస్తూ.. 'మీ అభిమానమే నాకు కొండంత బలం. ఈ అభిమానం కలకాలం ఇలాగే ఉండాలి' అని పేర్కొన్నది. ఎప్పటికప్పుడు మారే ఈ నంబర్ల రేస్‌లో ఈసారి మాత్రం శ్రద్ధా కపూర్ నంబర్‌వన్ అనిపించుకుంది. వచ్చే ఏడాది ఈ స్థానంలో మరో హీరోయిన్ ఉండొచ్చు.

# రికార్డులు తిరగరాస్తున్న కరుప్పు

## 300 కోట్ల వసూళ్లను దాటిన మూవీ




తమిళ స్టార్ హీరో సూర్య మరోసారి తన స్టార్ పవర్‌ను బాక్సాఫీస్ వద్ద నిరూపించారు. టాలెంటెడ్ దర్శకుడు ఆర్జే బాలాజీ దర్శకత్వంలో తెరకెక్కిన 'కరుప్పు' చిత్రం విడుదలైన తొలి రోజు నుంచే ప్రేక్షకులను ఆకట్టుకుంటూ విజయవంతమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. డివైన్ ఎలిమెంట్స్, కమర్షియల్ అంశాలు, భావోద్వేగాలతో రూపొందిన ఈ చిత్రం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకమైన రూ.300 కోట్ల గ్రాస్ కలెక్షన్ల మైలురాయిని అధిగమించి కొత్త రికార్డు సృష్టించింది. సినిమా విడుదలైనప్పటి నుంచి అన్ని ప్రాంతాల్లోనూ అద్భుతమైన స్పందన లభిస్తోంది. ముఖ్యంగా సూర్య పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్, ఎమోషనల్ పర్ఫార్మెన్స్, యాక్షన్ సీక్వెన్స్‌లు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దీంతో కుటుంబ ప్రేక్షకులు, యువత, మాస్ ఆడియన్స్ నుంచి సమానమైన ఆదరణ లభిస్తోంది. 'కరుప్పు' కథలోని ఆధ్యాత్మిక నేపథ్యం, భారీ స్థాయి విజువల్ ట్రీట్, కమర్షియల్ ఎలిమెంట్స్ సమతుల్యత సినిమాకు ప్రధాన బలాలుగా నిలిచాయి. ప్రేక్షకులను ఆరంభం నుంచి క్లైమాక్స్ వరకు ఆసక్తిగా కట్టిపడేసే విధంగా దర్శకుడు ఆర్జే బాలాజీ కథను తెరకెక్కించారని సినీ విశ్లేషకులు ప్రశంసిస్తున్నారు. సినిమా విజయంలో సాంకేతిక విభాగం పాత్ర కూడా కీలకమైంది. యువ సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ అందించిన నేపథ్య సంగీతం, పాటలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.రూ.300 కోట్ల మార్క్‌ను దాటిన 'కరుప్పు' ఇప్పుడు మరిన్ని వసూళ్ల రికార్డులపై కన్నేసింది. తమిళ సినీ పరిశ్రమలో కూడా 'కరుప్పు' ఒక ప్రత్యేక విజయగాథగా నిలిచేలా కనిపిస్తోంది.